ఈనాడు ఖమ్మం
శుక్రవారం అక్టోబరు 25, 2024

అనుమతి లేని నిర్మాణాలను ఆదిలోనే అడ్డుకోవాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, చిత్రంలో అదనపు కలెక్టర్ శ్రీజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: 'అనుమతి లేకుండా రెండంతస్తుల భవనం నిర్మించాక నోటీసులు ఇచ్చి మీరేం సాధిస్తారు.. ఆదిలోనే వాటిని ఎందుకు ఆపలేకపోతున్నారు' అని ప్రణాళిక విభాగం సిబ్బందిపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మండిపడ్డారు. గురువారం ఉదయం 10.30 గంటలకు సమీక్ష సమావేశం ఉంటుందని సమాచారమిచ్చిన కలెక్టర్ అదే సమయానికి సమావేశ మందిరానికి చేరుకున్నారు. అయితే అధికారులెవ్వరూ అక్కడ లేకపోవడంతో కమిషనర్ ఛాంబర్‌కు వెళ్లిపోయారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. ఖమ్మం నగరంలో నిర్మాణంలోని ప్రతి ఇంటి వివరాలు కార్పొరేషన్ వద్ద ఉండాలని, అనుమతులు, నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. రహదారులు, పాదదారుల ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేషన్ అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుద్ధ్య చర్యలపై పర్యవేక్షకుడు సాంబయ్యను ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకపోవడంతో సిబ్బంది, డివిజన్ల పరిస్థితిపై అవగాహన లేకుండా పారిశుద్ధ్య విధులు ఎలా నిర్వహిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ శ్రీజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఈఈలు కృష్ణలాల్, రంజిత్, సహాయ కమిషనర్ షఫిఉల్లా సిబ్బంది పాల్గొన్నారు.

5న ప్రజాభిప్రాయ సేకరణ

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సంబంధించి నవంబరు 5న ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, కుల సంఘాల ప్రతినిధులు, మేధావులు హాజరై తమ అభిప్రాయాలు తెలపవచ్చునని కోరారు. అభిప్రాయాలు, అభ్యర్థనలను రాతపూర్వకంగా అఫిడవిట్‌తో పాటు ఆరు సెట్లు తెలుగు లేదా ఆంగ్లంలో సమర్పించాలని సూచించారు. ప్రజల్లో వెనుకబాటుతనంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారని, ఇందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధం

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే



జిల్లా పంచాయతీ అధికారి ఆశాలతతో

ముఖాముఖి

గ్రామ పంచాయతీల్లో పౌరులకు మెరుగైన సేవలందించటంతో పాటు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా పంచాయతీ అధికారి స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామన్నారు. వివిధ అంశాలపై 'న్యూస్‌టుడే'తో ఆమె ముచ్చటించారు. ఆ వివరాలు మీ కోసం..

రూ.5.15 కోట్లు వసూలు

జిల్లాలోని 589 గ్రామ పంచాయతీల్లో రూ.24.62 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉంది. గతేడాది బకాయిలు రూ.8.50 కోట్లు, ఈ ఏడాది రూ.16.12 కోట్లు ఉన్నాయి. ఇప్పటివరకు రూ.5.15 కోట్లు వసూలయ్యాయి. మిగతావి రెండు నెలల్లో నూరు శాతం వసూలు చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. మండలాలవారీగా ఎంపీఓలకు లక్ష్యాలు నిర్దేశించాం. పన్నుల వసూలుపై పక్షం రోజులకు ఓసారి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నెలకోసారి కలెక్టర్ సమీక్షిస్తున్నారు.

ముఖ గుర్తింపు హాజరు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ కార్యదర్శులు రోజూ ఉదయం 8 గంటలకు తమ మొబైల్ యాప్‌లో ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో కొన్నాళ్లుగా ఈ విధానం అమలవటం లేదు. ఈ అంశాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణిస్తున్నారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్ మొబైల్ నంబర్లు చేర్చాం. వారిద్దరూ పంచాయతీ కార్యదర్శుల హాజరును పర్యవేక్షిస్తున్నారు. ఫలితంగా హాజరు శాతం కొంత మెరుగుపడింది.

☆ కలెక్టర్ ఆదేశాల మేరకు బీసీ కులగణనకు అనువుగా ప్రతి గ్రామ పంచాయతీలో 150 కుటుంబాల (హౌస్ హోల్డ్స్)ను ఒక బ్లాక్‌గా విభజిస్తున్నాం. రికార్డుల్లో నమోదు చేస్తున్నాం. త్వరలో కుల గణన ప్రారంభమవుతున్నందున ముందస్తుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జనగణనకు ఇవే ఉపయోగపడే అవకాశం ఉంది.

☆ గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రకటించాం. సామగ్రి వచ్చింది. సుమారు 3 వేలకు పైగా బ్యాలెట్ బాక్సులకు స్వల్ప మరమ్మతులు చేసి గోదాములో భద్రపరిచాం. జిల్లాలో మూడు దశల్లో ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక రూపొందించాం. సిబ్బంది వివరాలు కంప్యూటరీకరించాం.

బ్యాంకు ఖాతాల్లోనే వేతనాలు జమ

పారిశుద్ధ్య పనులు, ట్రాక్టర్ల ఈఎంఐ చెల్లింపు, విద్యుత్తు ఛార్జీలు, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు చెల్లించేందుకు ఇటీవలే రూ.8.85 కోట్లు జిల్లాకు విడుదలయ్యాయి. 2,363 మంది మల్టీపర్పస్ వర్కర్లకు మరో మూడు నెలల జీతాలు రావాల్సి ఉంది. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు వీరి బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించి పంపించాం. ఇక నుంచి వారి బ్యాంకు ఖాతాల్లోనే వేతనాలు జమ చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు.

నీటి ట్యాంకులు శుభ్రం

గ్రామాల్లో రోడ్ల పక్కన హరితహారంలో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కల సంరక్షణ చర్యలు చేపడుతున్నాం. ఇందుకు నిధులు డీఆర్డీఏ నుంచి విడుదల చేస్తున్నారు. ప్రతినెలా 1, 11, 21 తేదీల్లో గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌లు శుభ్రం చేయిస్తున్నాం. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాతో పాటు ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులు, డైరెక్ట్ పంపింగ్ మోటార్లు, బావులు సిద్ధంగా ఉన్నాయి. వీటినీ ఉపయోగిస్తున్నారు. కొన్ని మండలాల్లోని గ్రామాల్లో చివరి ప్రాంతంలోని ఇళ్లకు సరిపడా నీరు అందని పరిస్థితి ఉంది. అక్కడికి పంచాయతీ వనరుల నుంచి నీటిని సరఫరా చేస్తున్నాం.

ఆర్థిక భద్రతే కాదు.. ఆరోగ్యమూ ముఖ్యమే

☆ వయోధికులకు డాక్టర్ వేమ గంగరాజు సూచనలు

ఈటీవీ, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం వైద్యవిభాగం

'ఉద్యోగ విరమణ పొందాం. ఇంకేముంది? కృష్ణా రామా అనుకుంటూ హాయిగా విశ్రాంతి తీసుకుందాం. ఈ వయసులో శారీరక శ్రమ అవసరమా?' అరుపదులు దాటిన చాలామంది ఇలాగే ఆలోచిస్తుంటారు. ఉద్యోగ విరమణ పొందినవారు, వయసు పైబడి.. పనులకు విరామమిచ్చిన వారు ఆర్థిక భద్రత గురించి బాగానే ఆలోచిస్తుంటారు. ఆరోగ్య భద్రతను అంతగా పట్టించుకోరు. నిజానికి ఆర్థిక భద్రత కన్నా వెయ్యి రెట్లు ఆరోగ్య భద్రతకే ప్రాధాన్యమివ్వాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. మలివయసులో పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు, వ్యాయామాలతో కలిగే ప్రయోజనాలపై ఖమ్మంలో జనరల్ మెడిసిన్ ప్రముఖ వైద్యుడు డాక్టర్ వేమ గంగరాజు సూచనలు, సలహాలు మీకోసం..



వయసు పైబడుతున్న కొద్దీ జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. అజీర్ణం, పొట్ట ఉబ్బరం, పులిత్రేన్పులు వంటి సమస్యలు పెరుగుతాయి. అందువల్ల వయసుకు తగ్గట్టుగా ఆహారంలో మార్పులు చేసుకోవాలి. సమతుల ఆహారం తినాలి. చక్కెర, తీపిపదార్థాలు, ఉప్పు తగ్గించాలి. తినే ఆహారంలో సగం వరకు ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు ఉండాలి.

మితాహారమే మిన్న

మాంసకృత్తులు ముఖ్యమే. పిండిపదార్థాలు, నూనె, వేపుళ్లు తగ్గించుకోవాలి. ధూమపానం, మద్యపానం మానుకోవాలి. క్రమం తప్పకుండా రక్తపోటు, గ్లూకోజు, కొలెస్ట్రాల్ వంటి సాధారణ వైద్యపరీక్షలు చేయించుకోవాలి. మధుమేహం గలవారు మందులు, ఆహార, వ్యాయామ నియమాలతో గ్లూకోజును కచ్చితంగా అదుపులో ఉంచుకోవాలి.

మందులు వేసుకొని, ఆహారం తీసుకోకుండా నడిస్తే ఒక్కోసారి గ్లూకోజు మోతాదులు పడిపోవచ్చు. బొప్పాయి, జామ వంటి పండ్లు తీసుకోవాలి. శ్వాసకోశ బాధితులు ఆరుబయట కాకుండా ఇంట్లోనే నడవటం మేలు. ఉదయం 8 గంటల తర్వాత నడక మొదలెట్టాలి. మరీ చల్లగా ఉన్నపుడు నడవొద్దు.

వ్యాయామమే శ్రీరామరక్ష

విశ్రాంత సమయంలో ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి. వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటిపై దృష్టి సారించాలి. వ్యాయామాలతో నడక తెలిసిందే. నిశితంగా శరీరం దృఢంగా ఉండటమే కాకుండా మానసిక ఆరోగ్యమూ మెరుగవుతుంది. వ్యాయామాలు చేస్తే నృత్యం ఉల్లాసం, హాయి భావనను కలిగించే ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. అందువల్ల రోజుకు కనీసం 30 నిమిషాలు నడిస్తే మంచిది. వ్యాయామాలకు ముందు శరీరాన్ని సన్నద్ధం చేయటం (వార్మప్) ముఖ్యం. తద్వారా బిగుసుకున్న కండరాలు, కీళ్లు సడలుతాయి. గాయాల బారినపడే అవకాశం తగ్గుతుంది. వ్యాయామం చేసేటప్పుడు నూలు దుస్తులు ధరిస్తే మంచిది. రాళ్లు లేని ప్రాంతం, నడకకు ప్రత్యేకించిన ట్రాక్‌లో నడవటం మంచిది. నేల చదునుగా ఉన్నచోట నడిస్తే మోకాళ్ల నొప్పులు తలెత్తకుండా చూసుకోవచ్చు. వ్యాయామానికి ముందూ తర్వాత నీళ్లు తాగటం మర్చిపోవద్దు. వ్యాయామాలను ఆరంభించటానికి ముందు గుండె సామర్థ్యాన్ని పరీక్షించుకోవాలి. సాధారణంగా ఆరోగ్యవంతుల్లో గుండె.. రక్తాన్ని పంపింగ్ సామర్థ్యం (ఏఎఫ్) 60% ఉండాలి. గుండెజబ్బులతో బాధపడే కొందరిలో ఇది 30 శాతం ఉండొచ్చు. అంటే గుండె అంత సమర్థంగా పంప్ చేయటం లేదనే అర్థం. వీరికి నడక అంత మంచిది కాదు.





60 ఏళ్లపైబడిన వారు
ఖమ్మం: 1.66 లక్షలు
భద్రాద్రి : 1.54 లక్షలు

మానసిక ఉల్లాసమూ ప్రధానమే

జీవిత చరమాంకంలో మానసికోల్లాసం మెరుగుపరుచుకోవటం ముఖ్యం. వయసు పెరుగుతున్నకొద్దీ ఒంటరితనం ఆవహిస్తుంది. ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. రకరకాల ఒత్తిళ్లతో ఇబ్బందులు ఎదురవుతాయి. కాబట్టి మానసికంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఒత్తిడిని అధిగమించేందుకు యోగా, ధ్యానం ఉపయోగపడతాయి. అవసరమైతే వైద్యుల సలహా మేరకు మందులు వేసుకోవాలి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, మిత్రులతో సమయాన్ని గడపాలి. సామాజిక సంబంధాలు మెరుగుపరుచుకోవాలి. ఫ్రెండ్స్ క్లబ్బులు ఏర్పాటు చేసుకోవాలి. మనసుకు ఇష్టమైన సంగీతం, పుస్తకాలు చదవటం, ఇతరులతో చర్చించటం, సినిమాలు చూడటం, చిన్నపిల్లలతో ఆడుకోవటం వంటి అలవాట్లను కొనసాగించాలి. కొత్త విషయాలను నేర్చుకోవడం ద్వారా మెదడుకు ప్రేరణ కలుగుతుంది. క్రమపద్ధతిలో రోజువారీ పనులు చేసుకోవటం మంచిది. ఎదుటివారితో అనుభవాలు, భావోద్వేగాలను పంచుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుంది.



రాజేందర్‌సింగ్‌కు స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపల్ మహ్మద్ జాకిరుల్లా, ఎన్‌సీసీ విద్యార్థులు

ఉన్నత విద్యతోనే సమాజాభివృద్ధి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉన్నత విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలంగాణ కళాశాల విద్యా కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ ఆర్.రాజేందర్‌సింగ్ అన్నారు. ఖమ్మం ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన ఉమ్మడి జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజ ప్రగతిలో ఉన్నత విద్య కీలక భూమిక పోషిస్తుందన్నారు. ప్రవేశాలు, మౌలిక సదుపాయాల కల్పన, వార్షిక విద్యా ప్రమాణాల తీరుతెన్నులు, సెమిస్టర్ సిలబస్, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, ఉపాధి కల్పన కోర్సుల వివరాలు, విద్యార్థుల హాజరు శాతం తదితర అంశాలపై సమీక్షించారు. సమాజానికి ఉన్నత మానవ వనరులను అందించటంలో ప్రభుత్వ కళాశాలల పాత్ర అమోఘమైందని అభిప్రాయపడ్డారు. ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ మహ్మద్ జాకిరుల్లా తదితరులు పాల్గొన్నారు.

27న కరాటే జట్ల ఎంపిక

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: అండర్ 10 ఉమ్మడి జిల్లా కరాటే జిల్లా జట్లను ఆదివారం ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకుడు గోపతి సైదులు గురువారం తెలిపారు. ఆసక్తిగల జూనియర్ కళాశాలల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు సర్దార్ పటేల్ స్టేడియానికి రావాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలు వచ్చే నెలలో ఖమ్మంలోనే నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

కబడ్డీ: ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్ 19 కబడ్డీ జట్టును పటేల్ స్టేడియంలో ఆదివారం ఎంపిక చేస్తామని అసోసియేషన్ కార్యదర్శి మూసా కలీం తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని జూనియర్ కళాశాల క్రీడాకారులు పాల్గొనవచ్చని, ఆసక్తిగల వారు పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు.

నేడు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాక

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొత్తగూడెం నుంచి ఖమ్మంలో ఎన్నెస్పీ అతిథి గృహానికి రోడ్డు మార్గంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకుంటారు. అతిథి గృహంలో మధ్యాహ్న భోజనం తర్వాత 2 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. ఎంపిక చేసిన కవులు, కళాకారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీతలతో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశమవుతారు. సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో బయల్దేరుతారు. గవర్నర్ రాక సందర్భంగా ఆయన ప్రయాణించే మార్గంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాజ్యాంగాన్ని ఎత్తివేసేందుకు భాజపా కుట్ర: తమ్మినేని



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: బీఆర్ అంబేడ్కర్ రాసిన మహోన్నతమైన రాజ్యాంగాన్ని ఎత్తేయాలని భాజపా ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. కులమతాల మధ్య ఉద్రేకాలు సృష్టిస్తూ రాజకీయంగా లాభం పొందాలని చూస్తోందన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మోటాపురంలో గురువారం జరిగిన మండల మహాసభలో మాట్లాడారు. మోదీ దేశ సంపదను అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై అసంతృప్తి మొదలైందని చెప్పారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయకుండా కేవలం రూ.18 వేల కోట్లు మాత్రమే చేసి చేతులు దులుపుకొన్నారని, రైతు భరోసాపై ప్రభుత్వం నోరు మెదపడం లేదని దుయ్యబట్టారు. 150 ప్రజాసంఘాలతో తెలంగాణ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. మండల కార్యదర్శిగా మరోసారి కేవీ రామిరెడ్డిని ఎన్నుకున్నారు. పోతినేని సుదర్శన్‌రావు, పొన్నం వెంకటేశ్వరరావు, నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ శ్రీసుధకు ఆహ్వానం

ఖమ్మం న్యాయవిభాగం: హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ పి.శ్రీసుధను ఖమ్మం బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టులో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మధిరలో నూతన కోర్టు సముదాయాల ప్రారంభోత్సవానికి శనివారం వస్తున్న సందర్భంగా ఖమ్మం కోర్టునూ సందర్శించాలని ఆహ్వానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, కండె వెంకటేశ్వరరావు, కన్నెగంటి గోపి, సుగ్గల వెంకట్‌గుప్తా, దుర్గ పాల్గొన్నారు.

26న మహిళా న్యాయవాదుల సదస్సు: ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర మహిళా న్యాయవాదుల సదస్సును శని, ఆదివారాల్లో ఖమ్మంలో నిర్వహిస్తామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు నల్లమల నవీన్ చైతన్య గురువారం తెలిపారు. 'రాజ్యాంగం - మహిళా న్యాయవాదుల పాత్ర' అనే అంశంపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీసుధ తొలిరోజు మాట్లాడతారని పేర్కొన్నారు.

శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పర్యటన

ఏన్కూరు, తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: ఏన్కూరు మండలం లచ్చగూడెం, తిరుమలాయపాలెం మండలం సుబ్లేడులో కేంద్ర సర్వీసుల శిక్షణ అధికారులు వేర్వేరుగా గురువారం పర్యటించారు. స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయినులతో ముచ్చటించారు. తిమ్మారావుపేట ఏపీజీవీబీ ద్వారా రూ.3.56 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను స్వయం సహాయక సంఘాలకు అందజేశారు. శ్రీరామగిరి పంచాయతీలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్తు కనెక్షన్ కోసం రూ.6,600ను ఫోన్‌పే ద్వారా చెల్లించారు. క్షేత్రస్థాయి పర్యటన ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలపై అవగాహన వచ్చిందని శిక్షణాధికారులు తెలిపారు.



లచ్చగూడెంలో ఐసీడీఎస్, ఐకేపీ సిబ్బందితో కేంద్ర సర్వీసుల శిక్షణ అధికారులు

చింతకాని మండల భారాస అధ్యక్షుడి రిమాండ్

పోలీసులపై దౌర్జన్యం కేసులో అరెస్టు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: కొదుమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విధుల్లో ఉన్న పోలీసులపై దౌర్జన్యం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చింతకాని మండల భారాస అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య (ఏ10)తోపాటు గుని నరేశ్(ఏ1)ను పోలీసులు గురువారం కోర్టులో హాజరుపరిచారు. ఖమ్మం మూడో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి వి.మాధవి నిందితులకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. నిందితులను జిల్లా జైలుకు తరలించారు. రిమాండ్ రిపోర్టు ప్రకారం.. ఈనెల 5న విద్యుదాఘాతంతో మరణించిన లచ్చగూడెం వాసి గుని ప్రసాద్ మృతదేహంతో కొదుమూరు ఉపకేంద్రం ఎదుట స్థానికులు ధర్నాకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించేందుకు పోలీసులు యత్నించడంతో నిరసనకారులు అడ్డుకున్నారు. మృతదేహం ఉన్న ట్రాక్టర్‌ను కలెక్టరేట్ వద్దకు తరలించేందుకు ప్రయత్నించడంతో కొదుమూరు శివార్లలో పోలీసులు నిలిపేశారు. అక్కడ పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు, కానిస్టేబుళ్లను నెట్టేసి దౌర్జన్యం చేశారు. పోలీసులు తప్పుకోకపోతే ట్రాక్టర్‌తో తొక్కించి చంపేస్తామని బెదిరించారు. ఆ ఘర్షణలో కానిస్టేబుల్ బాలాజీకి గాయాలయ్యాయి. ఎస్సై నాగుల్‌మీరా ఫిర్యాదు మేరకు ఏ-1 గుని నరేశ్(ట్రాక్టర్ డ్రైవర్), ఏ-2 గుని ఉదయ్, ఏ-3 చల్లి వెంకట్, ఏ-4 చల్లి రాము, ఏ-5 కుక్కల శ్రీకాంత్, ఏ-6 బందెల రమేశ్, ఏ-7 చింతల రామారావు, ఏ-8 షేక్ సిద్ధా, ఏ-9 శీలం లింగయ్య, ఏ-10 పెంట్యాల పుల్లయ్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. నరేశ్, పుల్లయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

కేటీఆర్ ఆరా

మధిర: చింతకాని మండల భారాస అధ్యక్షుడు పుల్లయ్య అరెస్టు ఘటనపై ఆపార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. మధిర నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలని, ఈ వ్యవహారాన్ని పార్టీ లీగల్ సెల్ ద్వారా న్యాయపరంగా పోరాడుతుందని ఆయనతో చెప్పారు.

పేరుకే.. ఊరికే..!



ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పత్తి కొనుగోళ్లు ఊపందుకోలేదు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చాలావరకు పంట దెబ్బతింది. పత్తితీతలకు వర్షం ప్రధాన అవరోధంగా మారింది. ఎకరాకు 10-12 క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి ఇప్పుడు 3-4 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి కనిపించటం లేదు. వర్షాలకు ముందు తీసిన పత్తిని తమ అవసరాల నిమిత్తం రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. వర్షం ప్రభావం లేని ప్రాంతాల్లో రైతులు పత్తితీతలు మొదలుపెట్టారు.

– ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ధర లేక రైతులకు దిగాలు..

ఖమ్మం, ఏన్కూరు, వైరా వ్యవసాయ మార్కెట్ పరిధిలోని తల్లాడలో, సుజాతనగర్, జూలూరుపాడులో ప్రైవేటు వ్యాపారులు పత్తిని కొంటున్నారు. ప్రభుత్వం ఈసంవత్సరం పత్తికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,521 ప్రకటించింది. కానీ రైతులు తెచ్చే పత్తిలో నాణ్యత లేదనే సాకుతో వ్యాపారులు దోచుకుంటున్నారు. క్వింటాకు కేవలం రూ.5వేల నుంచి రూ.6,100 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని ఆరబెట్టుకుని ఆతర్వాత 'సీసీఐ' కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందటం ద్వారా మంచి లాభాలు ఆర్జిస్తారు. ఆరుగాలం కష్టపడిన రైతులకు అప్పులే మిగులుతున్నాయి.



ఖమ్మం మార్కెట్లో లారీలో లోడు చేసిన పత్తి బస్తాలు

సీసీఐ కొనుగోలు కేంద్రాలు వెలవెల..

ఖమ్మం జిల్లాలో తొమ్మిది, భద్రాద్రి జిల్లాలో నాలుగు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఖమ్మం గ్రామీణ మండలం గుర్రాలపాడులోని కొనుగోలు కేంద్రంలో తొమ్మిది మంది రైతులకు చెందిన 269 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొన్నారు. మిగతాచోట్ల ఎక్కడా ఒక్క కిలో పత్తినీ కొనకపోవటం గమనార్హం. ప్రస్తుతం రైతుల చేతికొచ్చిన పత్తిలో 20-30 తేమ శాతం ఉంటుంది. తేమ శాతం 8-12 ఉంటేనే సీసీఐ కొనుగోలు చేస్తుంది. తేమ శాతం ఎక్కువగా ఉండటంతో రైతులు తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 'సీసీఐ' కేంద్రాలకు వచ్చి కొనుగోళ్ల గురించి కర్షకులు ఆరా తీస్తున్నారు. వ్యవసాయశాఖ జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో తెలుసుకుంటున్నారు. తేమశాతంలో తేడా ఎక్కువగా ఉండటంతో ఇప్పట్లో 'సీసీఐ' కేంద్రాల్లో సరకును కొనుగోలు చేసే అవకాశం కనిపించటం లేదు. నవంబరు మొదటి వారం నుంచి కొనుగోళ్లు ఊపందుకుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు 'సీసీఐ' కేంద్రాల్లో కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

'సీసీఐ' కేంద్రాలు పత్తి కొనుగోళ్లకు సిద్ధంగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం 8-12 తేమ శాతం ఉంటేనే నిర్వాహకులు కొంటారు. ఇప్పుడు వచ్చే పత్తిలో తేమ శాతం చాలా ఎక్కువగా ఉంటోంది. అందుకే చాలామంది రైతులు వ్యవసాయ మార్కెట్లలో వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

- ఎంఏ అలీం, డీఎంఓ, ఖమ్మం

ఆడుదాం దాండియా!

ఖమ్మం బల్లేపల్లి, న్యూస్‌టుడే

ఆసక్తి చూపుతున్న అతివలు

దసరా, దీపావళి పండుగ సంబరాల్లో దాండియా నృత్యం ఒకభాగం. ఒకప్పుడు ఉత్తరాది రాష్ట్రాలకే పరిమితమైన దాండియా నృత్యం ఇప్పుడు అన్ని ప్రాంతాల్లో విస్తరించింది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో స్థిరపడిన ఉత్తరాది మగువలతో పాటు మన ఆడబిడ్డలు సైతం కొత్తగా దాండియా నృత్యంపై ఆసక్తి చూపుతున్నారు. దశాబ్ద కాలంగా కోలాట నృత్యాలతో సందడి చేస్తున్న నారీమణులు ఇప్పుడు ఉత్సాహంగా ఇంకో అడుగు ముందుకేశారు. రెండేళ్ల నుంచి ఈవెంట్ ఆర్గనైజర్స్ హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరంలోనూ 'దాండియా నైట్' పర్వదినాల సందర్భంలో ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలల్లో సైతం స్వాగత వేడుకల్లో యువత దాండియాతో దుమ్మురేపుతున్నారు. ఈ క్రమంలో దాండియా శిక్షణ తీసుకున్న మహిళలను 'న్యూస్‌టుడే' పలకరించింది.


దాండియా శిక్షణ తీసుకున్న వనితలు

దాండియాకు ప్రత్యేకంగా అలంకరణ



దాండియా నృత్యానికి నప్పేలా ఉండాలని అలంకరణ కోసం శ్రద్ధ తీసుకున్నా. అందుకోసం ప్రత్యేకంగా వస్త్రాలను కొనుగోలు చేశా. దాండియాకు తగ్గట్టుగా నా దగ్గర ఉన్న నగల సెట్స్‌లో ఒకటి ఎంపిక చేసుకున్నా. సుమారుగా రూ.3 వేల వరకూ ఖర్చు చేశా. ఈ సంవత్సరం ఇలా అలంకరించుకుని మా బృందంతో దాండియా ఆడటం చాలా సంతోషం కలిగించింది.

– పల్లపోతు జ్యోతి, ఖమ్మం

సంప్రదాయ నృత్యంలో శిక్షణ తీసుకున్నాం



దాండియా నృత్యం కోసం డ్యాన్స్ మాస్టర్ దగ్గర శిక్షణ తీసుకున్నాం. గత సంవత్సరం 'దాండియా నైట్' వేడుకల్లో సరదాగా పాల్గొన్నాం. ఈ సంవత్సరం నెలరోజులు ముందుగానే ప్రణాళిక వేసుకున్నాం. డ్యాన్స్ మాస్టర్‌కు రూ.2 వేలు రుసుము కట్టి చేరా. స్టూడియోకు వెళ్లి నేర్చుకున్నాం. ఈ సంవత్సరం ఉత్తరాదివారిలా అలంకరించుకుని నృత్యం చేశాం.

– తడిశెట్టి శ్రీలత, ఖమ్మం


సరికొత్త ఉత్సాహం



కొత్త ఉత్సాహంతో దాండియా నృత్యం వేశాం. కిట్టీ పార్టీ తరపున పండుగల సమయాల్లో ఇంతకు ముందు కోలాటం వేసేవాళ్లం. మా బృందం తరుపున ఆధ్యాత్మిక ప్రాంతాల్లో కోలాట వేడుకల్లో పాల్గొన్నాం. ఈ సంవత్సరం మా స్నేహితులతో దాండియా నృత్య శిక్షణ తీసుకుని దసరా ఈవెంట్‌లో పాల్గొన్నాం. నృత్యంతో మా బృందంలో నయా జోష్ వచ్చింది.

– పెనుగొండ రాధ, ఖమ్మం

వైద్యసేవలకు ఊతం.. ఉపాధికి మార్గం



ఉభయ జిల్లాలకు 120 పారా మెడికల్ సీట్ల కేటాయింపు

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, ఖమ్మం వైద్యవిభాగం

వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించటంలో వైద్యులు కీలకంగా వ్యవహరిస్తారు. బయటకు కనిపించేది వీరే అయినా.. తెరవెనుక నుంచి వైద్యులకు సాయమందించేవారు చాలామందే ఉంటారు. ఈవిభాగంలో పారా మెడికల్(వైద్య అనుబంధ నిపుణులు) ప్రముఖ పాత్ర పోషిస్తారు. పారా మెడికల్ కోర్సుల శిక్షణకు ఖమ్మం, కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలు వేదిక కానున్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి ఈ రెండు కళాశాలల్లో 60 చొప్పున పారా మెడికల్ సీట్లకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలంగాణ పారా మెడికల్ బోర్డ్(టీజీపీఎంబీ) ఆదేశించింది.

ఒక్కో కళాశాలలో రెండేసి కోర్సులు

పారా మెడికల్ విభాగంలో మొత్తం 21 కోర్సులు అందుబాటులో ఉండగా.. వీటిలో కొత్తగూడెం వైద్యకళాశాలకు డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్(డీఎల్ఎంటీ), డిప్లొమా ఇన్ డయాలసిస్), ఖమ్మంలోని ప్రభుత్వ వైద్యకళాశాలకు డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ(డీఎంఐటీ), డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నాలజీ(డీఏఎన్ఎస్) కోర్సులను కేటాయించారు. ఒక్కో కోర్సులో 30 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు.

తీరనున్న సిబ్బంది కొరత

ఖమ్మం, కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలకు పారా మెడికల్ సీట్లు కేటాయించటంతో వైద్యసేవలు మెరుగవుతాయని పలువురు వైద్యులు చెబుతున్నారు. రెండేళ్ల వ్యవధి గల ఈ కోర్సుల్లో ఏడాది పాటు తరగతి గదిలో పాఠాలు నేర్చుకోగా.. మరో ఏడాది వైద్యులకు సహకరిస్తూ విద్యనభ్యసిస్తారు. దీనివల్ల ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత తీరనుంది. ఏటా వైద్య కళాశాల పరిధిలోని స్థానిక యువతకే పారా మెడికల్ సీట్లు కేటాయిస్తారు. విద్యాభ్యాసం అనంతరం వీరు ఈరంగంలోని ప్రభుత్వ కొలువుల కోసం పోటీపడొచ్చు. లేదా ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఉపాధి పొందవచ్చు.

వైద్యసేవల్లో పారా మెడికల్ పాత్ర

- ★ రోగులను పరీక్షించటం, వ్యాధి నిర్ధారణ
- ★ ప్రత్యేకమైన సమయాల్లో అత్యవసర చికిత్స అందించటం
- ★ వెంటిలేటర్లు, డెఫిబ్రిలేటర్లు లాంటి వైద్యపరికరాల నిర్వహణ
- ★ రోగుల ఆరోగ్య సమాచారమందించటం
- ★ ప్రాథమిక చికిత్స అంశాలను నేర్పించటం

ఎంపిక విధానం..

రెండేళ్ల కాలపరిమితి గల పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్‌లో బైపీసీ ఉత్తీర్ణులై ఉండాలి. బైపీసీ విద్యార్థులు లేకుంటే ఎంపీసీ విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు. ఈ రెండు గ్రూప్‌ల వారు లేకుంటే ఇతర గ్రూప్‌ల విద్యార్థులకు ప్రవేశం కల్పించే అవకాశముంటుంది. సీట్లను ప్రభుత్వ రిజర్వేషన్ల మేరకు ప్రతిభ ఆధారంగా కేటాయిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది.

నవంబర్ 25న తరగతులు ప్రారంభం

పారా మెడికల్ సీట్ల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల 21న వెలువడింది. ఈనెల 30 వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. కోర్సులకు ఎంపికైన విద్యార్థుల వివరాలు నవంబర్ 13న అధికారులు వెల్లడిస్తారు. ఎంపికైన వారి జాబితాపై టీజీపీఎంబీ నవంబర్ 22న తుది ప్రకటన చేస్తుంది. సీట్లు పొందిన విద్యార్థులకు నవంబర్ 25 నుంచి తరగతులు జరుగుతాయని ఖమ్మం, కొత్తగూడెం ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రిన్సిపల్స్ డా.రాజేశ్వరరావు, డా.రాజ్‌కుమార్ తెలిపారు.

ఎర్రుపాలెం మీదుగా కొత్త రైల్వే లైన్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని దేశం నలుమూలలతో అనుసంధానించటానికి రూ.2,245 కోట్ల విలువైన 57 కిలోమీటర్ల రైల్వే లైన్‌ను కేంద్రం ప్రకటించింది. నాలుగేళ్లలో దీన్ని పూర్తి చేస్తామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ లైన్‌తో అమరావతి నుంచి హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా, నాగ్‌పుర్, బెంగళూరుకు నేరుగా, ముంబయి, దిల్లీకి హైదరాబాద్, నాగ్‌పుర్‌ల మీదుగా అనుసంధానం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఎర్రుపాలెం నుంచి మొదలయ్యే ప్రాజెక్టు పెద్దాపురం, చెన్నారావుపాలెం, గొట్టిముక్కల, పరిటాల, కొత్తపల్లి, వడ్లమాను, అమరావతి, తాడికొండ, కొప్పవరం మీదుగా నంబూరు వరకు సాగుతుంది.

70 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

కొత్తగూడెం సింగరేణి: సింగరేణిలో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో గురువారం పరిశీలించారు. వివిధ విభాగాల్లో 139 ట్రైనీ పోస్టుల భర్తీకి గతంలో నిర్వహించిన రాత పరీక్షల ఫలితాలు ఇటీవల వెల్లడైన విషయం తెలిసిందే. తొలిరోజు 70 మంది ధ్రువపత్రాలను జీఎం శామ్యూల్ సుధాకర్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేశారు. మిగతా వారి పత్రాలను శుక్రవారం పరిశీలించనున్నారు.

మెడికల్ బోర్డుకు 179 మంది హాజరు

కొత్తగూడెం సింగరేణి: సింగరేణి ప్రధాన వైద్యశాలలో మెడికల్ బోర్డు గురువారం ప్రారంభమైంది. తొలిరోజు వైద్యపరీక్షలకు 179 మంది కార్మికులు హాజరయ్యారు. మొత్తం 204 మందికి మెడికల్ బోర్డు నుంచి పిలుపు అందింది. హైదరాబాద్ నుంచి రానున్న వైద్యనిపుణులు శుక్రవారం పరీక్షల నివేదికల ఆధారంగా వైద్యపరంగా అనర్హులైన వారిని ఎంపిక చేస్తారు.

నేడే దీపావళి బోనస్ విడుదల

కొత్తగూడెం సింగరేణి: దీపావళి (పీఎల్ఆర్) బోనస్‌ను సింగరేణి యాజమాన్యం కార్మికుల బ్యాంకు ఖాతాల్లో శుక్రవారం జమచేయనుంది. ఒక్కో ఉద్యోగికి బోనస్‌గా రూ.93,750 చెల్లించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది.

బాధ్యతల బరువు.. కానరాని ఆదెరువు

ఆమె తల్లిదండ్రులకు అమ్మాయింది. తమ్ముడి భారం భుజాన వేసుకుంది. కడుపున పుట్టిన ముగ్గురిని చదివిస్తోంది. అనారోగ్యంతో కునారిల్లుతున్న కుటుంబ సభ్యులను ఆదుకోవాలని, ప్రభుత్వం చేయూత అందించాలని వేడుకుంటోంది ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం గోపాలపురానికి చెందిన శైలజ. భర్త లేకపోవడంతో ఈమె పిల్లలతోపాటు తల్లిదండ్రుల వద్దకు వచ్చి గోపాలపురంలో ఉంటోంది. తండ్రి వీరాస్వామికి రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగిపోయాయి. తల్లి బేబీ మెదడులో రక్తం గడ్డకట్టి బాధపడుతోంది. నెలకు వీరిద్దరి వైద్య ఖర్చులకే రూ.10 వేలు అవుతోంది. వీరికి తోడు దివ్యాంగుడైన తమ్ముడు సైదిబాబును ఈమే చూసుకుంటోంది. నగరంలోని ఓ హోటల్‌లో పని చేసి ముగ్గురు పిల్లల(ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి)ను చదివిస్తోంది. అక్కడ మిగిలిన ఆహారం, కూరలు తెచ్చుకొని పూట గడుపుతున్న దయనీయమైన పరిస్థితి వీరిది. సొంత ఇల్లు లేదు. నెలకు రూ.3 వేలు చెల్లించి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. తండ్రి కాళ్లలో అమర్చిన రాడ్లు తొలగించేందుకు శస్త్ర చికిత్స చేయించాల్సి ఉంది. పూట గడవడమే గగనమైన పరిస్థితిలో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తోంది శైలజ. ప్రభుత్వం ఆసరా పింఛను, ఇల్లు మంజూరు చేయాలని చేతులెత్తి వేడుకుంటోందా కుటుంబం. – ఈనాడు, ఖమ్మం


తమ్ముడు సైదిబాబుకు సపర్యలు చేస్తున్న శైలజ

కానిస్టేబుల్ బ్యాచ్ @ 1984

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: వారంతా 1984 బ్యాచ్ పోలీసు ఉద్యోగులు. శాఖలో పని చేస్తూ ఉద్యోగోన్నతులు పొంది ప్రస్తుతం హెడ్ కానిస్టేబుల్, ఏఎస్సై, ఎస్సై హోదాల్లో పలు పోలీసు స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వీరంతా ఒకచోట కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఖమ్మం నగరంలోని ఓ ఫంక్షన్ హాలు ఈ వేడుకకు వేదికైంది. 1984 బ్యాచ్ కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించుకున్నారు. మొత్తం 105 మంది ఉండే



బ్యాచ్‌లో ప్రస్తుతం 41 మంది సర్వీసులో ఉన్నారని, 39 మంది ఉద్యోగ విరమణ చేశారని నిర్వాహకులు తెలిపారు. 25 మంది కన్ను మూసినట్లు చెప్పారు. మృతుల కుటుంబాలను ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు.

రాములోరికి పునర్వసు పూజలు

భద్రాచలం, దుమ్ముగూడెం: పునర్వసును పురస్కరించుకుని భద్రాచలం శ్రీ సీతా రామ చంద్రస్వామి, పర్ణశాల రామాలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. మాడవీధులన్నీ రామ నామాలతో మార్మోగాయి. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేనుణ్ని పూజించి పుణ్యాహ వాచనం నిర్వహించారు. మాంగళ్యధారణ తలంబ్రాల వేడుక చేశారు. దర్బారు సేవలో స్వామి వైభవం మరింత పెరిగింది.

భక్త రామదాసు ధ్యాన మందిర సందర్శన

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యాన మందిరాన్ని కళాశాల విద్య మల్టీజోన్-1 జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్ గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మందిర పూజారి సౌమిత్రి రమేష్ ధ్యాన మందిర విశిష్టతను తెలియజేశారు. నేలకొండపల్లి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలను తనిఖీ చేశారు. ప్రిన్సిపల్ ఆలేటి పరంజ్యోతి, అధ్యాపకులు శ్రీనివాసరావు, వెంకటరాజం తదితరులు పాల్గొన్నారు.

అడవిలో దారితప్పిన యువకుడు.. కాపాడిన పోలీసులు

మల్హర్, న్యూస్‌టుడే: అటవీ ప్రాంతంలో దారితప్పిపోయిన యువకుడిని పోలీసులు రక్షించారు. ఖమ్మంకు చెందిన జస్వ అనే యువకుడు ద్విచక్రవాహనంపై పని నిమిత్తం మంచిర్యాల వెళ్లి బుధవారం తిరుగు పయనమయ్యారు. మల్హర్ మండలం కిషన్‌రావుపల్లి నుంచి అడవిలోని కాలిబాట ద్వారా భూపాలపల్లి చేరుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో కిషన్‌రావుపల్లికి చేరుకోగానే చీకటిపడింది. గూగుల్ మ్యాప్ ఆధారంగా వెళ్తుండగా.. రాత్రి 11.30 గంటల సమయంలో అడవిలో దారితప్పిపోయాడు. ద్విచక్రవాహనం చెడిపోయింది. చిమ్మచీకట్లో ఎటూవెళ్లలేని పరిస్థితి. భయాందోళనకు గురై 100 నెంబర్‌కు ఫోన్ చేశారు. స్పందించిన కొయ్యూర్ ఎస్సై నరేష్ భయపడొద్దని ఎప్పటికప్పుడు ధైర్యం చెప్పారు. గ్రామస్థుల సహకారంతో దాదాపు రెండు గంటల పాటు అడవిలో వెతికారు. ప్రాణ భయంతో ఉన్న జస్వను ఎట్టకేలకు బయటకు తీసుకురావడంతో ఉత్కంఠ వీడింది. చెడిపోయిన ద్విచక్రవాహనానికి మరమ్మతు చేయించి ఎస్సై సురక్షితంగా ఇంటికి పంపించారు.


బయటకు తీసుకొచ్చిన యువకుడితో పోలీసులు, గ్రామస్థులు

తపాలా శాఖ ఆధ్వర్యంలో లేఖ రచన పోటీలు

ఖమ్మం క్రీడలు: తపాలాశాఖ లేఖరచన పోటీలు నిర్వహించేందుకు ఆ శాఖ తేదీలు ప్రకటించింది. లేఖలు ఈనెల 14 నుంచి డిసెంబరు 14 లోగా పంపాల్సి ఉంటుంది. 'డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాధాన్యం' అనే అంశంపై హిందీ, ఆంగ్లం, ప్రాంతీయ భాషల్లో ఇన్‌ల్యాండ్ లెటర్, కార్డుపై 500 పదాలకు మించకుండా, ఎన్వలప్ కవర్లో ఏ4 సైజులో 1,000 పదాలకు మించకుండా రాయాలి. 18 ఏళ్లలోపు, ఆపై వయసుల వారు ఇలా రెండు విభాగాల్లో పోటీలు ఉంటాయి. ఈ లేఖలను డిసెంబరు 14 లోగా చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్ చిరునామాకు పంపించాలని ఖమ్మం డివిజన్ తపాలా అధికారి వీరభద్రస్వామి సూచించారు.

నార్కోటిక్ డ్రగ్స్ అధికారుల తనిఖీలు



ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: నార్కోటిక్ డ్రగ్ పోలీసు అధికారులు ఖమ్మం నగరంలో వాహన తనిఖీలను గురువారం రాత్రి తనిఖీ చేశారు. ఇల్లెందు క్రాస్ రోడ్డులో పలు కార్లను ఆపిన వారు క్షుణ్ణంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇవి సాధారణంగా జరిగే తనిఖీలేనని, ఎటువంటి మత్తు పదార్థాలు పట్టుబడలేదని ఖమ్మం రెండో పట్టణ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు.

చిన్నారుల బ్యాక్వార్డు స్కేటింగ్ సాహస యాత్ర

కూసుమంచి, న్యూస్‌టుడే: ప్రపంచ రికార్డు సృష్టించాలనే లక్ష్యంతో బాల సోదరులిద్దరూ హైదరాబాద్ నుంచి భద్రాచలం వరకు 300 కిలోమీటర్ల బ్యాక్వార్డు స్కేటింగ్ యాత్రను గురువారం చేపట్టారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీ ప్రాంతం నుంచి యాత్ర ప్రారంభమైంది. స్కేటింగ్ యాత్రికులు రాజేష్‌కుమార్(8), ఉమేష్‌కుమార్(7) మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడేనికి చేరుకున్నారు. తల్లిదండ్రులు, కోచ్‌లు, స్కేటింగ్ సహచరులు, గిన్నిస్‌బుక్ రికార్డు నమోదు జడ్జీల తోడుగా జాతీయ రహదారిపై ఈ సోదరుల స్కేటింగ్ యాత్ర కొనసాగింది. వీరికి నాయకన్‌గూడెంలో స్థానిక నాయకులు స్వాగతం పలికారు. గతంలో నమోదైన 200 కి.మీ. గిన్నిస్‌బుక్ రికార్డును 300 కి.మీ. బ్యాక్వార్డ్ స్కేటింగ్‌తో తమ పిల్లలు అధిగమించబోతున్నారని రాజేష్‌కుమార్, ఉమేష్‌కుమార్ తండ్రి నవీన్‌కుమార్ చెప్పారు. బాలికల రక్షణతో పాటు మత్తుపదార్థాలను నిర్మూలించాలంటూ చేపట్టిన ఈ యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించిందన్నారు.


బ్యాక్వర్డ్ స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

తమది ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామమని, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నట్లు వివరించారు.

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అపహరించిన ముగ్గురు అంతరాష్ట్ర నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనపరచుకున్నారు. ఏలూరు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ గురువారం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏడాదిగా నూజివీడు టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో 6, ఎ.కొండూరు-1, మచిలీపట్నం-1, మైలవరం-2, తిరువూరు-1, ఒంగోలు-1, విజయవాడ కృష్ణలంక-2, సత్తుపల్లి-1, చింతలపూడి స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనాలను ముగ్గురు దుండగులు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆయా ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో నూజివీడులో టౌన్ సీఐ సత్య శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి రాజీవ్ సర్కిల్ వద్ద గురువారం ఓ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళుతున్న ముగ్గురిని ఆపి విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వేంసూరు మండలం కల్లూరుకు చెందిన బత్తుల పవన్‌కల్యాణ్, అదే గ్రామానికి చెందిన భీమిరెడ్డి సీతారామిరెడ్డి, దూళ్లకొత్తూరుకు చెందిన దనికొండ రమేష్ నిందితులు అని ఎస్పీ పేర్కొన్నారు. పవన్ కల్యాణ్, రమేష్ ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు. డబ్బులు సులభంగా సంపాదించాలని సీతారామిరెడ్డిని కలుపుకొని చోరీలకు పాల్పడుతున్నారని వివరించారు.

నాణ్యమైన వంట పాత్రలు అందించాలి

భద్రాచలం: గిరిజన విద్యాలయాలకు నాణ్యమైన వంట పాత్రలను అందించాలని గిరిజన సంక్షేమ శాఖ ఖమ్మం డీడీ విజయలక్ష్మి తెలిపారు. ఖమ్మం జిల్లాలోని మెట్రిక్ వసతిగృహాలకు అవసరమైన వంట గిన్నెలు, ప్లేట్లు, గ్లాసులు, గ్రైండర్లు, కుక్కర్ల సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో గురువారం నిర్వహించారు.

కుమార్తెను వ్యభిచార కూపంలోకి నెట్టిన తల్లికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా: కుమార్తెను వ్యభిచార వృత్తిలోకి దింపిన మహిళకు న్యాయస్థానం జీవితఖైదుతోపాటు రూ.2,96,000 జరిమానా విధించింది. ఖమ్మం నగరానికి చెందిన ఓ మహిళ(35) భర్త చనిపోవడంతో ఇద్దరు కుమార్తెలతో కలిసి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో పని చేసేది. విలాసాలకు అలవాటుపడ్డ ఆమె డబ్బు కోసం వ్యభిచార వృత్తి ఎంచుకుంది. ఆమె పెద్ద కుమార్తె(21) ప్రేమ వివాహం చేసుకొని భర్తతో కలిసి హయత్‌నగర్‌లో స్థిరపడింది. రెండో కుమార్తె(16)ను డబ్బుల కోసం వ్యభిచారం చేయాలని తల్లి బలవంతం చేయగా బాలిక నిరాకరించింది. ఈ క్రమంలో బాలికను ఖమ్మంలోనే వ్యభిచారం నిర్వహించే కుక్కల ఆశ(25)కు విక్రయించింది. చెర నుంచి తప్పించుకున్న బాలిక హయత్‌నగర్‌లో ఉండే అక్క ఇంటికి చేరుకుంది. ఆమె తల్లి, ఆశ మరికొందరు కలిసి హయత్‌నగర్‌కు వచ్చి బాలికను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు వారిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి హరీశ.. రెండో నిందితురాలైన బాలిక తల్లికి శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ.12లక్షలు పరిహారం మంజూరు చేశారు. ఆశ కోర్టుకు రానందున ఆమెపై బెయిలుకు వీల్లేని వారెంటు జారీ చేస్తూ విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్

జూలూరుపాడు: చేతబడి అనుమానంతో జరిగిన ఓ వ్యక్తి హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి కథనం ప్రకారం.. రాచబండ్లకోయగూడేనికి చెందిన కుంజా ప్రవీణ్, అతడికి వరసకు మామ అయిన మల్కం గంగయ్య అలియాస్ గంగులు కలిసి అదే గ్రామానికి చెందిన కుంజా భిక్షం(42)ను చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో హత్య చేశారు. ప్రవీణ్ తల్లి అనారోగ్యానికి భిక్షం కారణమని ఇలా చేశారు. గ్రామంలో ఈనెల 21న ఓ యువకుడి కర్మకాండలు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రవీణ్, గంగయ్య హాజరయ్యారు. ఈ మేరకు మందు తాగుదామంటూ భిక్షాన్ని వెంటబెట్టుకుని సమీపంలోని వేపలవాగు వద్దకు వెళ్లారు. అక్కడ మద్యం తాగి రాయితో కొట్టి భిక్షాన్ని హత్య చేశారని సీఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దుమ్ముగూడెం: రోడ్డు ప్రమాదంలో యువకుడు గురువారం మృతి చెందారు. కొత్తనారాయణరావుపేటకు చెందిన పాయం జంపన్న(19) తన స్నేహితుడు కొమరం వీరయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై లక్ష్మీనగరం వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో చినార్లగూడెం కొంగవాగు పాఠశాల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పటంతో కిందపడ్డారు. తీవ్రగాయాలపాలైన జంపన్న అక్కడికక్కడే మృతిచెందారు. అపస్మారకస్థితికి చేరుకున్న వీరయ్యను స్థానికులు 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు..

కూసుమంచి: మల్లేపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జుజ్జులరావుపేటకు చెందిన ఐతం అనిల్(31) మృతిచెందారు. సుతారి పనులు చేస్తూ జీవనం గడుపుతున్న అనిల్ ముదిగొండ మండలం మాదాపురం వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగొస్తుండగా మల్లేపల్లి సమీపంలో ఎదురుగా అతివేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. అతడి తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108 వాహనంలో నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనిల్ బంధువు మైసయ్య ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ నామవరపు వెంకటేశ్వర్లుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో యువతి బలవన్మరణం

తిరుమలాయపాలెం: చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. ఏలువారిగూడేనికి చెందిన యువతి(17) పిండిప్రోలు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో మరిపెడ మండలం చిల్లంచర్లకు చెందిన మాతంగి విష్ణుతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారింది. కొంతకాలం ప్రేమించుకున్న తరువాత ఆమెను పెళ్లి చేసుకోనని విష్ణు తేల్చిచెప్పాడు. మనస్తాపానికి గురైన ఈనెల 23న గడ్డి మందు తాగింది. ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం చనిపోయింది. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు విష్ణుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: బాలికను నమ్మించి లైంగికంగా దాడి చేసిన యువకుడిపై ఖమ్మం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ కథనం ప్రకారం... నగరంలోని పాఠశాలలో 14 ఏళ్ల బాలిక పదో తరగతి చదువుతోంది. మూడు నెలలుగా బంధువైన 25 ఏళ్ల యువకుడు ఆమెను పాఠశాలలో దింపుతానంటూ తీసుకెళ్తూ మాయమాటలతో లొంగదీసుకున్నాడు. పలుమార్లు ఆమెపై లైంగిక దాడి చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

విదేశీ కొలువు.. స్పందన కరవు!

టామ్‌కామ్ ముఖాముఖికి 9 మందే..!

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే

దుబాయ్‌లో డెలివరీ బాయ్స్‌గా పని చేయాలనుకునే ద్విచక్ర వాహన చోదకులు(బైక్ రైడర్ల)కు చాలా డిమాండ్ ఉంది. పదో తరగతి విద్యార్హత, మూడేళ్ల డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు ఉన్న 21 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులు. ఖమ్మం జిల్లాలో ఆసక్తి ఉన్న వారి కోసం ఉపాధి కల్పన శాఖ గురువారం ఖమ్మం మోడల్ కెరీర్ సెంటర్లో దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించింది. ఆశావహులు వచ్చినప్పటికీ వీరిలో 9 మందికి మాత్రమే పాస్‌పోర్టులున్నాయి. ఇందులోనూ తుది పరిశీలన వరకు ఎందరు మిగులుతారో వేచి చూడాలి. ప్రభుత్వం టామ్‌కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో కొలువులను వెతికి, ఇక్కడి నుంచి వెళ్లేవారి కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది.


ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులు

పూర్తి ప్రభుత్వ భద్రత, భరోసాతో అభ్యర్థులను విదేశీ కొలువులకు పంపుతున్నారు. బైక్ రైడర్లు జిల్లాలో చాలామంది ఉన్నారు. ఆహార డెలివరీ సంస్థల్లో వందల మంది పని చేస్తున్నారు. ముందుగా అవగాహన కల్పించి ఉంటే విదేశీ కొలువులకు వచ్చే వారి సంఖ్య పెరిగేదనే చర్చ ఉంది. వచ్చిన అభ్యర్థుల్లో చాలామంది విదేశాల్లో ఇలాంటి అవకాశాలు ఉన్నాయని ముందస్తు సమాచారం ఉంటే అందుకు తగిన విధంగా అన్ని సమకూర్చుకునేవాళ్లమని చెప్పారు. అన్ని అర్హతలు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు పాస్‌పోర్టు కావాలంటే రాదు కదా? అని వచ్చిన వారిలో కొందరు నిరాశ వ్యక్తం చేశారు. టామ్‌కామ్ సంస్థ విదేశాల్లో కొలువులు చూపిస్తోందని అంటున్నారు. అందుకు తగిన సమాచారం ఇక్కడ స్థానిక కార్యాలయంలో ఉండటం లేదని, మొత్తం హైదరాబాదులోనే.. ఇక్కడేమీ లేదని చెబుతుంటే కనీస సమాచారం మాకు అందేదెప్పుడని ఒకరిద్దరు ఆవేదన చెందారు. దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి మాధవి పర్యవేక్షించారు.

సత్తుపల్లి
•సత్తుపల్లి •మధిర •వైరా

పోలీసు అమరుల త్యాగాలు స్మరణీయం


ర్యాలీ తీస్తున్న కమాండెంట్, అధికారులు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని మండలంలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వీజీపీసీ చక్రవర్తి అన్నారు. పోలీస్ ఫ్లాగ్‌డే దినోత్సవాల్లో భాగంగా గురువారం గంగారం నుంచి సత్తుపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కమాండెంట్ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని కాంక్షతో సిబ్బంది, అధికారులతో శిరస్త్రాణాలు ధరించి ర్యాలీ చేసినట్లు తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎస్డీ రంగారెడ్డి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అబ్కారీ శాఖకు రూ.42 వేల ఆదాయం

కారేపల్లి: సారా, బెల్లం సరఫరా చేస్తున్న వ్యక్తుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలను కొద్ది నెలల క్రితం అబ్కారీ శాఖ స్వాధీనం చేసుకున్నారు. కారేపల్లి అడ్డ రోడ్డులో శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బహిరంగ వేలంలో ఒక వాహనాన్ని రూ.42వేలకు ఓ వ్యక్తి దక్కించుకున్నారు. మరో వాహనంపై ఎవరూ ఆసక్తి చూపలేదు. ఏఎస్ వేణుగోపాల్‌రెడ్డి, సీఐ ప్రశాంతి, ఎస్సై వసంతలక్ష్మి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: భాగ్యనగరతండా పంచాయతీ పరిధిలో పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తుతోంది. - స్థానికుడు

సమాధానం: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం. - **సురేందర్, ఎంపీడీఓ** - కారేపల్లి, న్యూస్‌టుడే

✆ వీఎం బంజరలోని ఎంప్లాయిస్ కాలనీలో మురుగునీరు పోయేందుకు కాలువ సక్రమంగా లేకపోవడంతో మురుగు నిలిచి దోమల వ్యాప్తి చెందుతోంది. అనారోగ్యం పాలవుతున్నాం. - **కొడుమూరి వీరభద్రం, వీఎం బంజర్**

✔ సమస్య దృష్టికి వచ్చింది. వెంటనే పరిష్కరిస్తాం. - **ముస్తాఫా, కార్యదర్శి, వీఎం బంజర్** - పెనుబల్లి, న్యూస్‌టుడే

స్తంభాల పునరుద్ధరణ

స్పందనకు వందనం

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: మల్లారం-జాలిముడి రహదారిలో పొలాల పక్కన విద్యుత్తు స్తంభాలు ఒరిగి ఇబ్బందికరంగా మారాయి. 'ఒరిగిన స్తంభాలు.. పట్టింపులేని అధికారులు' శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆ శాఖ అధికారులు సరిచేయించారు.

మురుగు కాలువలో వ్యర్థాల తొలగింపు

పెనుబల్లి, న్యూస్‌టుడే: పెనుబల్లి బీసీ కాలనీలోని జర్నలిస్ట్ కాలనీలో మురుగుకాలువలో పూడిక పేరుకుపోయి మురుగు రహదారిపై నిలుస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. కార్యదర్శి ముస్తాఫా దృష్టికి తీసుకెళ్లగా కాలువలో పేరుకుపోయిన పూడిక తొలగింపజేశారు.

ప్రొద్దుటూరులో ఉద్రిక్త పరిస్థితి

చింతకాని భారాస మండలాధ్యక్షుడి అరెస్ట్

చింతకాని, వైరా, న్యూస్‌టుడే: చింతకాని మండలం భారాస అధ్యక్షుడు, ప్రొద్దుటూరు మాజీ సర్పంచి పెంట్యాల పుల్లయ్య అరెస్టు నేపథ్యంలో గ్రామంలో గురువారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. లక్ష్మీపురం రైతు గురు ప్రసాద్ ఈనెల 5న విద్యుదాఘాతంతో మృత్యువాత పడగా రైతు ప్రసాద్ మృతదేహంతో గ్రామస్థులు కొదుమూరు విద్యుత్తు ఉపకేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. మృతదేహాన్ని ట్రాక్టర్‌పై ఎక్కించి కలెక్టరేట్‌కు తరలించే క్రమంలో అడ్డుకున్న పోలీసుల వైపు ట్రాక్టర్‌ను వేగంగా నడిపిన సంఘటనకు సంబంధించి పుల్లయ్య సహా పది మందిపై కేసు నమోదైంది. ఈ క్రమంలో పుల్లయ్యను అరెస్టు చేసేందుకు గురువారం సీఐలతో పాటు వైరా, తల్లాడ, కొణిజర్ల, బోనకల్లు ఎస్సైలు భారీ పోలీస్ బలగాలతో మధ్యాహ్నం ప్రొద్దుటూరులో పుల్లయ్య ఇంటికి చేరుకున్నారు. పుల్లయ్యను అరెస్టు చేసి వాహనంలో తీసికెళ్తుండడంతో బంధువులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు అడ్డుకున్నారు. ఒకానొక దశలో పోలీసులకు, స్థానికులకు మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. పుల్లయ్యను మొదట మధిర గ్రామీణ పోలీస్ స్టేషన్‌కు తరవాత మధిర ప్రభుత్వాసుపత్రికి, ఆ తరవాత వైరా పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇంతలో కమల్‌రాజు, అభిమానులు, భారాస నాయకులు భారీ ఎత్తున వైరా ఠాణా వద్దకు చేరుకున్నారు.


పుల్లయ్యను అరెస్ట్ చేసి తరలిస్తున్న పోలీసులు

పుల్లయ్య భార్యకు గుండెపోటు

పుల్లయ్య అరెస్టుతో ఆయన సతీమణి పెంట్యాల భారతమ్మకు గుండె పోటు రావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తల్లా పోలీసుల తీరు: కమల్‌రాజు

మధిర, మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: అధికార పార్టీ నాయకుల మాటలు విని పోలీసు అధికారులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరించి పెంట్యాల పుల్లయ్యను అక్రమంగా అరెస్టు చేశారని జడ్పీ మాజీ ఛైర్మన్, భారాస మధిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి లింగాల కమల్‌రాజు ఆరోపించారు. మధిర భారాస కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రైతు కుటుంబానికి భరోసాగా నిలబడినందుకు కక్షసాధింపు చర్యలన్నారు. భారాస నాయకులతో కలిసి కమల్‌రాజు గ్రామీణ ఠాణా వద్ద నేలపై కూర్చొని నిరసన తెలిపారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆటలకు అనువేది?

పల్లె క్రీడాకారులను ప్రోత్సహించి తమకు నచ్చిన ఆటల్లో నైపుణ్యం సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. రూ.లక్షల నిధులు వ్యయం చేసినా నిర్వహణ లోపాలతో నిరుపయోగంగా మారాయి.
– కల్లూరు, న్యూస్‌టుడే


గడ్డిపెరిగి నిరుపయోగంగా శ్రీరాంపురం క్రీడా ప్రాంగణం

✦ పంచాయతీలకు క్రీడా సామగ్రి అప్పగింత

2022-23 సంవత్సరంలో సత్తుపల్లి నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం కింద 94 నిర్మాణాలు చేపట్టారు. అరెకరం నుంచి ఎకరం స్థలం కేటాయించి వాటిలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ తదితర కోర్టులను ఏర్పాటు చేశారు. అనంతరం వాటి నిర్వహణను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. పంచాయతీలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడా సామగ్రిని అప్పగించారు. అటుపై వీటిని పట్టించుకోక పోవడంతో గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి నిరుపయోగంగా మారాయి. స్థలాల కొరతతో కొన్ని నిర్మాణాలు జరగలేదు. నియోజకవర్గంలోని అన్ని క్రీడా ప్రాంగణాలు ఆటలకు అనువుగా లేకుండా పోయాయని క్రీడాకారులు ఆవేదన చెందుతున్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో నిర్మాణాలు

మండలం	క్రీడా ప్రాంగణాలు
కల్లూరు	28
తల్లాడ	14
పెనుబల్లి	20
సత్తుపల్లి	15
వేంసూరు	17


✦ మండస్థాయి అండర్ 14 ఖోఖో, కబడ్డీ అథ్లెటిక్స్‌లో చెన్నూరు పాఠశాల నుంచి పాల్గొని ప్రత్యేక బహుమతులను పొందాను. క్రీడా ప్రాంగణాల్లో మంచి వసతులు ఉంటే ఇంకా నైపుణ్యాన్ని సాధించి ఉన్నత స్థాయికి వెళ్లేవాడిని.
– ఎస్కే షకీల్‌మహమద్, క్రీడాకారుడు, చెన్నూరు

✦ క్రీడా ప్రాంగణాలు ఉపయోగకరంగా తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇస్తాం. –చంద్రశేఖర్, ఎంపీడీఓ

వానొస్తే బురదమయం

కల్లూరు మండలం బత్తులపల్లి, చెన్నూరు, కల్లూరు వంటి పెద్దగ్రామాల్లో ఎకరం వరకు ప్రభుత్వ స్థలాల్లో రూ.50 వేల నుంచి రూ.85వేల వ్యయంతో నిర్మించారు. హనుమాతండా, కిష్టయ్యబంజర్, తూర్పు లోకారం, పడమర లోకారం, ముచ్చవరం గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో నిర్మాణాలు జరగలేదు. చెన్నూరులోని క్రీడా ప్రాంగణంలోకి పొలాల నీరు చేరుతోంది. పెద్దకోరుకొండిలో డంపింగ్ యార్డు పక్కన ఉండడంతో ట్రాక్టర్లు తిరిగి గుంతలు ఏర్పడ్డాయి. కల్లూరు పట్టణం శ్రీరాంపురంలో పిచ్చిచెట్లు పెరిగి విషపురుగులకు నెలవుగా మారింది. కొర్లగూడెంలో ఎకరంలో ఏర్పాటు చేసినా వర్షం నీరు నిలిచి బురదమయమైంది.

ఆన్‌లైన్ ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలోని వ్యాపారస్తులు ఆన్‌లైన్ ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని పుర కమిషనర్ ఎం.రవిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తీసుకోకుంటే పుర చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకుని సదరు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అధికారుల బృందం పర్యటన

కారేపల్లి, న్యూస్‌టుడే: సివిల్ సర్వీస్ శిక్షణ అధికారుల బృందం ఆల్యాతండాలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా నాలుగో రోజు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఉపాధి హామీ పనులు, చెరువుల్లో పూడికతీత, సింగరేణి గనుల్లో జరిగే పనులను పరిశీలించారు. అనంతరం శాంతినగర్ ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద అన్నారు. స్థానిక విరాట్‌నగర్ శివారులోని సింగరేణి ఉద్యోగుల పీవీ నరసింహారావు సెంటినరీ కాలనీ క్వార్టర్స్ సముదాయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ముఖ ద్వారాన్ని గురువారం పీవో ప్రారంభించారు. పిట్ కార్యదర్శి రామారావు, వెల్ఫేర్ అధికారి దేవదాస్ పాల్గొన్నారు.

కుప్పలు.. తెప్పలు

మధ్యతరహా వైరా జలాశయం వద్ద కుప్పలుగా కనిపిస్తున్న తెప్పలు ఇవి. చేపల వేటతో జీవనం సాగిస్తున్న మత్స్యకారులు ఈ తెప్పలపైనే వేట కొనసాగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వేటకు దిగే క్రమంలో తెప్పలను ఒడ్డునే ఉంచిన దృశ్యమిది. – వైరా, న్యూస్‌టుడే



పనులకు ప్రమాదకర ప్రయాణం!



ఏన్కూరు, జూలూరుపాడు మండలాల్లో పత్తి ఏరివేత, మిర్చి తోటలో కలుపుతీత పనుల కోసం తల్లాడ, కల్లూరు మండలాల నుంచి కూలీలు రోజూ ఆటోలు, మినీ వ్యానుల్లో వెళ్తున్నారు. ఆటోలో గురువారం ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. – తల్లాడ, న్యూస్‌టుడే

ఊరి శివారున ఊడల మర్రి



ఇదీ వైరా శివారు మార్గంలో ఉన్న మర్రి చెట్టు. కొన్ని దశాబ్దాల నాటి వృక్షం కావడంతో దీని ఊడలు అతి పెద్దవిగా ఉండి కొమ్మల నుంచి ఏకంగా భూమిలోకి దిగి వి'చిత్రం'గా కనిపిస్తోంది. – వైరా, న్యూస్‌టుడే

నిత్యాన్న సంతర్పణ ప్రారంభం


మాలధారులకు భోజనం వడ్డిస్తున్న సీఐ కిరణ్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి శివారు శ్రీహరిహరాత్మజ అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. 50 రోజుల పాటు అయ్యప్ప మాలధారులకు నిత్యాన్నసంతర్పణ(భిక్ష)ను సీఐ టి.కిరణ్ పూజల అనంతరం ప్రారంభించారు. తొలి రోజు మరిడి చంద్రమోహన్, రజిని దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఏకగ్రీవం

పెనుబల్లి, న్యూస్‌టుడే: పెనుబల్లి ముత్యాలమ్మ ఆలయ కమిటీని గ్రామస్థులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొర్రా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా మిద్దె స్వామి, కోశాధికారిగా అన్నపురెడ్డి లక్ష్మయ్యలు ఎన్నికయ్యారు.

అమ్మపాలెంవాసికి డాక్టరేట్

కొణిజర్ల, న్యూస్‌టుడే: అమ్మపాలేనికి చెందిన గుగులోత్ వెంకన్న జేఎన్‌టీయూ అనంతపూర్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ డిపార్టుమెంట్‌లో చేసిన పరిశోధనకు డాక్టరేటు లభించింది. డేటా మైనింగ్‌లో టెక్ట్స్ డాక్యుమెంట్ క్లస్టరింగ్ యూసింగ్ సెంట్రాయిడ్ అండ్ నైబర్‌హుడ్ అప్రోచెస్ అంశంపై సమర్పించిన పరిశోధనకు పీహెచ్‌డీ పట్టా అందజేశారు.

ఒప్పందం ఉంటేనే సాగు చేయాలి

వైరా, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో హైబ్రీడ్ మొక్కజొన్న విత్తన ఉత్పత్తి సాగు చేపట్టే రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీ కరుణశ్రీ పేర్కొన్నారు. మొక్కజొన్న విత్తన ఉత్పత్తి చేపట్టే కంపెనీతో అగ్రిమెంట్ బాండ్ చేసుకున్న తర్వాతనే సాగు చేయాలని సూచించారు.

సహకార సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడి మృతి

వైరా, న్యూస్‌టుడే: సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న తాటిపూడికి చెందిన తాతా రంగారావు(78) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. తెదేపా ఆవిర్భావం నుంచి మూడు దశాబ్దాలపాటు పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. 1988-1995 వరకు తాటిపూడి సర్పంచిగా, 2006-11 వరకు ఎంపీటీసీ సభ్యుడిగా, 2014-19 వరకు వైరా విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులున్నారు. రంగారావు మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మార్క్‌ఫెడ్ మాజీ ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, పురపాలక ఛైర్మన్ సూతకాని జైపాల్, కట్టా కృష్ణార్జున్‌రావు సందర్శించి నివాళి అర్పించారు.


తాతా రంగారావు

రైతులను ఆదుకోవాలని నిరసన

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు ఆధ్వర్యంలో రైతులు గురువారం ఖమ్మంపాడు రైతు వేదిక ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏఈఓకు వినతిపత్రం అందజేశారు.

కూలీ రేట్లు పెంచాలని డిమాండ్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకన్న డిమాండ్ చేశారు. స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో గురువారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తిబాబు, శ్రీనివాస్, వెంకన్న, సాంబయ్య పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

కల్లూరు, న్యూస్‌టుడే: తన పొలంలోకి వెళ్లకుండా ఓ రైతు అడ్డుకుంటున్నారని పాత యర్రబోయినపల్లి గ్రామానికి చెందిన రైతు బీరవెల్లి వెంకటేశ్వరరావు ఆరోపించారు. అనాదిగా అదే దారి నుంచి వెళ్తున్నామని, న్యాయం చేయాలని కోరుతూ డీఏఓ శ్రీనివాసరావు, తహసీల్దార్‌కి గురువారం వినతి పత్రం అందజేసినట్లు బాధిత రైతు తెలిపారు.

తాగునీటి ఇబ్బందులుండొద్దు

కారేపల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని శాఖ ఈఈ వాణిశ్రీ, డీఈ నరసింహారావు సూచించారు. అప్పాయిగూడెం రైతువేదికలో పంపు ఆపరేటర్లకు గురువారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. నీటి సరఫరాలో ఉత్తమ సేవలు అందించిన పలువురికి ప్రశంసాపత్రాలు అందించారు.

పాల వ్యాపారంతో మహిళలకు ఉపాధి: కలెక్టర్


పాలశీతలీకరణ కేంద్రం వద్ద మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: పాలవ్యాపారం ద్వారా ప్రతి మహిళ నెలకు రూ.15వేలు సంపాదించునే అవకాశం ఉందని, పాడి రైతులకు వారం రోజుల్లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఎర్రుపాలెంలోని ఇందిరా మహిళా డెయిరీ పాలశీతలీకరణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. పాడి రైతులు, పాల సేకరణ, రవాణా, ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా సమాఖ్య, పాడి రైతుల నుంచి కొందరిని ఎంపిక చేసి గుజరాత్‌లోని అమూల్ డెయిరీ పరిశీలనకు పంపిస్తామన్నారు. డీఆర్‌డీఓ సన్యాసయ్య, తహసీల్దార్ ఉషాశరద, ఎంపీడీఓ సురేందర్, డెయిరీ మేనేజర్ సిద్ధేశ్వర్, ఏపీఎం కె.వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య బాధ్యులు పాల్గొన్నారు.

బోనకల్లు, న్యూస్‌టుడే: బోనకల్లులో ఇందిరా డెయిరీ బల్క్ మిల్క్ యూనిట్(బీఎంయూ) నిర్మాణాన్ని డీఆర్‌డీవో సన్యాసయ్య పరిశీలించారు. యూనిట్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు.

ఓట్ల నమోదుపై ఆర్డీఓ సమీక్ష

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, ఎంఈఓలతో ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఓట్ల నమోదుపై ఆర్డీఓ రాజేందర్‌గౌడ్ తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు డివిజన్ పరిధిలో 145 దరఖాస్తులు ఫాం నంబర్ 19 ద్వారా వచ్చాయని, వీటిని పరిశీలించి నివేదికలను తహసీల్దార్‌లకు అందజేయాలని సూచించారు. అనంతరం ధరణి, కల్యాణలక్ష్మి, మీసేవ తదితర దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. డీఏఓ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

వాహనం అదుపుతప్పి ఒకరి మృతి

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై కె.వెంకటేశ్ కథనం మేరకు.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లకు చెందిన వేముల దుర్గారావు(40) ద్విచక్రవాహనంపై మధిర నుంచి కంచికచర్ల వైపు వెళ్తుండగా మీనవోలు గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి కింద పడటంతో తలకు బలమైన గాయమైంది. 108లో మధిర ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతుడి వద్ద ఉన్న నగదు రూ.56,400లను పైలట్ మణికుమార్, టెక్నీషియన్ కృష్ణారెడ్డిలు స్టాఫ్‌నర్సు ఉమకు అందించారు. దుర్గారావుకి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


దుర్గారావు

ఆలయ స్థల కొనుగోలుకు విరాళం

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్, మేరమ్మతల్లి దేవాలయాల నిర్మాణం, స్థల కొనుగోలుకు చిక్కుల అప్పయ్య ట్రస్టు సభ్యులు చిక్కుల వెంకట రామారావు, రమేశ్, మురళీకృష్ణ, గంధం స్వరాజ్యలక్ష్మి రూ.2,15,116లను గురువారం పసుమర్తి చందర్‌రావు వారి నివాస గృహంలో అందజేశారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, బాల, కృష్ణ, ప్రసాద్, ధర్మ, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


దాత చిక్కుల రమేశ్‌తో నాయకులు

తేమ ఉంటేనే ధాన్యం కొనుగోలు చేయండి

కల్లూరు, న్యూస్‌టుడే: వరి ధాన్యంలో 12శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేయాలని, సన్న రకాలకు ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి (డీఎంఓ) అబ్దుల్ అలీమ్ సూచించారు. పట్టణ పరిధిలోని ఏఎంసీ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మార్కెట్ కార్యదర్శి పంతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంఓ అబ్దుల్ అలీమ్, చిత్రంలో కార్యదర్శి పంతులు

బోనకల్లు, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఐకేపీ, సహకార సంఘాల సిబ్బందికి మండల ప్రత్యేకాధికారి విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో 11 కొనుగోలు కేంద్రాలకు చెందిన ఐకేపీ గ్రామ సమాఖ్యలు, సహకార సంఘాల సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముదిగొండ, న్యూస్‌టుడే: పెద్దమండవ మున్నేరు నుంచి ఖమ్మంకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను హెడ్‌కానిస్టేబుల్ సైదయ్య బాణాపురం వద్ద గురువారం పట్టుకుని ఠాణాకు తరలించారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ముదిగొండ సీఐ మురళి తెలిపారు.

విద్యుత్తు మోటార్లు అపహరణ

చింతకాని, న్యూస్‌టుడే: మండలంలోని రాఘవాపురంలో మూడు వ్యవసాయ విద్యుత్తు మోటార్లు బుధవారం రాత్రి అపహరణకు గురయ్యాయి. రైతు వడ్డె పుల్లయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంట్లో చోరీ

కారేపల్లి, న్యూస్‌టుడే: చింతలతండాలో భూక్యా బుజ్జితోపాటు కుటుంబ సభ్యులు గురువారం వారి చేనులో పనులకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం అపహరించారు. ఈ విషయంపై బాధితురాలి ఫిర్యాదుతో ఎస్సై రాజారామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపల్లెవాడలో చిరుతపిల్ల సంచారం

ఏన్కూరు, న్యూస్‌టుడే: ఏన్కూరు మండలం రేపల్లెవాడ సమీపంలోని పొలాల్లో చిరుత పిల్ల సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గురువారం గుర్తించారు. రైతు వెనిగండ్ల శ్రీహరి మిరప పొలంలో ఈ నెల 23న సాయంత్రం ఓ యువకుడు చిరుత పిల్లను చూసి దూరం నుంచి చరవాణిలో వీడియో తీశాడు. ఆ విషయాన్ని పొలం యజమానితోపాటు పోలీసులకు తెలిపాడు. వారు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో తల్లాడ డీఆర్‌ఓ శ్రీనివాసరావు తమ సిబ్బందితో పొలం వద్ద పాదముద్రలు గుర్తించి చిరుత పిల్లగా నిర్ధారించారు. అనంతరం రేపల్లెవాడ, మేడేపల్లి గ్రామాల్లో మైకు ద్వారా అప్రమత్తం చేశారు. ఒంటరిగా పొలాల్లోకి వెళ్లవద్దని, చిరుత కనిపించినా ప్రాణహాని చేయవద్దని స్పష్టం చేశారు. ఇటీవల జూలూరుపాడు మండలం నుంచి ఓ చిరుత మునియాతండా, భద్రుతండా వైపు సంచరించింది. దీంతో రైతులు పొలాల్లోకి వెళ్లాలంటే వెనకాడుతున్నారు. జూలూరుపాడు నుంచి వచ్చిన చిరుతకు కొత్తగా కనిపించిన పిల్లకు సంబంధంలేదని అక్కడ కనిపించిన జంతువు పాదముద్రలు పెద్దగా ఉన్నాయని అటవీ అధికారులు తెలిపారు.

పైపులైన్ పగిలి.. సరఫరా నిలిచి


ఏన్కూరులో నిరుపయోగంగా భగీరథ ట్యాంకు

ఏన్కూరు, న్యూస్‌టుడే: ఏన్కూరు ఉన్నత పాఠశాలలోని భగీరథ ట్యాంకు నుంచి నెలరోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆ ప్రాంత వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. టీఎల్‌పేట రహదారి, ఎస్‌బీఐ కాలనీ, ప్రధాన రహదారి ప్రజలు నీటికోసం చేతిపంపుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. కొంత మంది వాహనాలపై డ్రమ్ములతో తీసుకొస్తున్నారు. ప్రధాన కూడలిలో దుకాణదారులు ఆ నీటిపైనే ఆధారపడుతున్నారు. కనీసం చేతులు కడుక్కోవడానికి కూడా నీళ్లు లేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై మిషన్ భగీరథ ఏఈ సురేశ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఖమ్మం-కొత్తగూడెం ప్రధాన రహదారి మధ్యలో పైపులైన్ పగిలిందని, రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తిచేస్తామని తెలిపారు.

తనిఖీ నివేదికలపై సమీక్ష

వేంసూరు, న్యూస్‌టుడే: మండలంలో 2023-24 సంవత్సరంలో నిర్వహించిన ఉపాధిహామీ పనులపై డీఆర్డీఏ అదనపు పీడీ బి.శిరీష ఆధ్వర్యంలో అధికారుల బృందం వేంసూరులో గురువారం ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 26 పంచాయతీల్లో ఉపాధి నిధులు రూ.5.22కోట్లతో 616, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.1.95 కోట్లతో 56 పనులు నిర్వహించారు. ఈ నెల 19 నుంచి 24వరకు ఉపాధి పనులపై గ్రామాల వారీగా సామాజిక తనిఖీలు నిర్వహించారు. ప్రజావేదికలో తనిఖీల నివేదికలపై సమీక్షించారు. కూలీలకు వేతనాలు చెల్లించని, అదనంగా చేసిన ఖర్చులపై పలువురు ఉపాధి సిబ్బందికి రికవరీ పెట్టారు. మర్లపాడు, పల్లెవాడ, వెంకటాపురం గ్రామాల్లో నిర్వహించిన పనుల్లో అవకతవకలు జరిగినట్లు స్థానికులు, కూలీలు కొందరు తెలుపగా ఆయా గ్రామాల్లో పనులపై సమీక్షను వాయిదా వేశారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటపతిరాజు, విజిలెన్స్ అధికారులు పవన్, శాస్త్రి, ఎస్‌ఆర్‌పీ వెంకన్న, మార్కెట్ ఛైర్మన్ ఆనందబాబు, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఏపీవో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌బడి


బొమ్మలతో ఆకర్షణీయంగా ఉన్న పెద్దమండవ అంగన్‌వాడీ కేంద్రం

ఈ చిత్రాలను చూశారా.. ముదిగొండ మండలం పెద్దమండవలోని అంగన్‌వాడీ కేంద్రం ఇది. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి పలు కార్యక్రమాలను చేపట్టింది. అందులో భాగంగా ఎంపిక చేసిన కేంద్రాలను చిన్నారులు ఆకర్షించేలా తీర్చిదిద్దుతుంది. పెద్దమండవలోని అంగన్‌వాడీ బడిలో గోడలపై ఆకట్టుకునే చిత్రాల సాయంతో కథలు, పాఠాలు, పదాలు నేర్పిస్తున్నారు. గోడలపై తీర్చిదిద్దిన బొమ్మల సాయంతోనే చిన్నారులకు బోధిస్తున్నారు. కొన్నిరకాల బొమ్మ వస్తువులను తెచ్చి వాటి సాయంతోనూ పిల్లలకు విజ్ఞానం అందిస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్ సరస్వతి రమణశ్రీ తెలిపారు. బొమ్మలను చూపిస్తూ కథలు చెబుతుంటే పిల్లలు ఆసక్తిగా వింటున్నారని చెప్పారు.

– ముదిగొండ, న్యూస్‌టుడే



చిత్రాలు చూపిస్తూ చిన్నారులకు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్ రమణశ్రీ

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

కానిస్టేబుల్‌ను అభినందించిన సీపీ



ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: దిల్లీలో అక్టోబరు 20న జరిగిన వేదాంత హాఫ్ మారథాన్ రన్‌లో పతకం సాధించిన కానిస్టేబుల్ పిల్లి రాజుని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు. మొత్తం 36 వేల మంది పాల్గొన్న ఈ పోటీలో రాజు గంట 53 నిమిషాల్లో పూర్తి చేసి మెడల్ సాధించారు. ఆగస్టు 28న హైదరాబాద్‌లో జరిగిన ఎన్ఎండీసీ మారథాన్ 42 కిమీ పరుగులో పాల్గొన్న రాజు 4:42 గంటల్లో పూర్తి చేశారు. కానిస్టేబుల్ రాజును అభినందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. టౌన్ ఏసీపీ రమణమూర్తి, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి: తాతా మధు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: చింతకాని భారాస అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి ఆయనను వెంటనే విడుదల చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్సీ తాతా మధుసూదన్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భారాస కార్యకర్తలను లొంగదీసుకునేందుకు అధికార పార్టీ నేతలు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 91541 18165
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సమస్య: సాగర్ ప్రధాన కాల్వ నుంచి మంగాపురం మేజర్‌కు సాగునీటిని నిలిపివేశారు. వరి పొలాలకు తడులు అవసరమున్న తరుణంలో నీటి సరఫరా ఆగితే దిగుబడులపై ప్రభావం ఉంటుంది. - జగన్మోహన్ రావు, వనంవారికిష్టాపురం

సమాధానం: మంగాపురం మేజర్‌కు నీటి అవసరంపై స్థానిక ఇంజినీర్ల ద్వారా ప్రతిపాదనలు పంపి నీటి విడుదల చేస్తాం. - మంగలంపూడి వెంకటేశ్వర్లు, ఎస్ఈ

– కూసుమంచి, న్యూస్‌టుడే

వెల్లివిరిసిన దాతృత్వం



తిరుమలాయపాలెం: నిత్యావసరాలతో సంస్థ ప్రతినిధులు

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: సొసైటీ ఆఫ్ ద గుడ్ షెఫర్డ్ సిస్టర్స్, నాగపూర్ ఆధ్వర్యంలో ఇటీవల వరదలతో సర్వం కోల్పోయిన రాకాశితండాలోని సుమారు 70 కుటుంబాలకు గురువారం నిత్యావసరాలతో పాటు దుప్పట్లు పంపిణీ చేశారు. సిస్టర్స్ నిర్మల, దీప్తి, రాజ్యం, పాదర్ సురేశ్, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడు కుంటల భూదానం: రఘునాథపాలెం, న్యూస్‌టుడే: రఘునాథపాలెం మండలం పాపటపల్లికి చెందిన ఎండీ భాషు ముస్లింల శ్మశానవాటికకు స్థానికంగా మూడు కుంటల భూమిని దానంగా ఇచ్చారు. గ్రామానికి చెందిన ఎండీ అక్బర్(28) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలకు కబరస్థాన్ లేకపోవడంతో శ్మశాన వాటిక ఉన్న ముస్లింలు సైతం అక్బర్ అంత్యక్రియలకు అనుమతించలేదు. దీంతో స్పందించిన భాషా పేద ముస్లింల అంత్యక్రియల నిమిత్తం తన భూమిలో మూడు కుంటలను దానంగా ఇచ్చారు. సదరు భూమిలో అక్బర్ అంత్యక్రియలు నిర్వహించారు. భాషాని, ఆయన కుటుంబ సభ్యులను గ్రామస్థులు అభినందించారు.

మెకానిక్ కుటుంబానికి.. ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ద్విచక్ర వాహన మెకానిక్ ఏలూరి నాగేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల ఆకాల మృతి చెందారు. ఆయన కుటుంబానికి ద్విచక్ర వాహన మెకానిక్ల సంఘం ఆధ్వర్యంలో రూ.20 వేల నగదును వంగాల కొండలరావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. లింగనబోయిన మురళి, పులుసు శ్రీను, అన్నదేవర భద్రం, విజ్ఞాన ప్రసాద్, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

'సకల ఉద్యోగుల సమ్మేళనాన్ని విజయవంతం చేయండి'

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: నవంబరు 3న ఖమ్మంలో నిర్వహించే సకల ఉద్యోగుల సమ్మేళనంలో నిర్వహించే వన సమారాధన కార్యక్రమానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక వైద్యురాలు కృపా ఉషశ్రీ అన్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో వన సమారాధనకు సంబంధిత గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ నాయకులు జయపాల్, చంద్రశేఖర్, ప్రవీణ్, స్థానిక వైద్యులు అమర్‌సింగ్, నాగేశ్వరరావు, రాజ్‌కుమార్, తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐలు లక్ష్మణ్, సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయంలో శారదాదేవి, శ్రీనివాసరావు, ఎస్సై కూచిపూడి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బరిలో అమ్మలు!

తరుణి

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

పెళ్లికి ముందు వారు పేరుమోసిన క్రికెట్ క్రీడాకారులు.. ఎన్నో మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించి జిల్లా ఘనత చాటారు. ఆనక పెళ్లి కావడంతో కుటుంబ బాధ్యతల్లో తలమునకలయ్యారు. తమకు ఆటంటే ఉన్న ఇష్టాన్ని మాత్రం వదులుకోలేదు. అవసరమైన ప్రతి సందర్భంలో మేమున్నామంటూ ముందుకొస్తున్నారు. చేయూత అందిస్తున్నారు. ఖమ్మం మహిళా క్రికెటర్లపై ప్రత్యేక కథనం..



సీనియర్ మహిళా క్రికెటర్లు పద్మ, సుభద్ర, శైలజ, రాధికతో జూనియర్ క్రికెటర్ అంజలి

జిల్లా మహిళా క్రికెట్ సంఘం కార్యకలాపాల కేంద్రం కూడా ఇదే. ఇక్కడి మహిళా క్రికెట్ జాబితాలో నమోదై ఉన్న ఈ క్రీడాకారిణులు అవసరమైనప్పుడు క్రికెట్‌కు సహకారం అందిస్తున్నారు. గత ఏడాది స్టేడియంలో నిర్వహించిన ఉమెన్స్‌లీగ్, మెన్‌లీగ్, టీ20 వంటి మ్యాచుల్లో అంపైరింగ్, స్కోరింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. ఒకరిద్దరు మినహా ఎక్కువ మంది తమ అభిరుచికి తగిన ఉద్యోగం కావాలని కోరుతున్నారు. ఇటీవల ఖమ్మం వచ్చిన స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. ఏదేమైనా వీరు తమకు ఆసక్తి ఉన్న క్రికెట్‌లో తమదైన ముద్ర వేస్తున్నారు.

▶ జరపాల పద్మకు 2007 లోనే హెచ్‌సీఏ ఉమెన్ క్రికెట్ లీగ్ ఆడిన అనుభవం ఉంది. నాటి నుంచి స్థాయిగల 14 మ్యాచుల్లో ఆల్‌రౌండర్‌గా సత్తా చూపారు. తర్వాత వివాహం చేసుకున్నారు. భవాని(13), వరుణ్‌సాయి(11) పిల్లలు. వీరిని క్రికెట్‌లో ప్రోత్సహిస్తున్నారు. స్థాయిగల మ్యాచ్ ఉండి పిలుపు వస్తే ఇప్పటికీ మైదానంలో ఉంటున్నారు.

▶ శైలజ సీనియర్ మహిళా క్రికెటర్. బీపీఈడీ, నర్సింగ్ కోర్సులు పూర్తి చేశారు. ఇటీవలే మహబూబాబాద్ జిల్లాలో నర్సు ఉద్యోగం సాధించారు. క్రికెట్ ప్రస్థానంలో 13 స్థాయిగల మ్యాచులు ఆడిన అనుభవం సొంతం. మూడుసార్లు సౌత్ జోన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. భర్త, పిల్లలు దివ్యకృప(7), సత్యకృప(3) ఉన్నారు. మ్యాచులు ఉన్నప్పుడు ఇప్పటికీ ఆడేందుకు సిద్ధమంటున్నారు.

▶ రాధిక ఉత్తమ ఆల్‌రౌండర్, పూర్తి అవగాహనతో అంపైరింగ్ బాధ్యతలు నిర్వహించగలరనే పేరు సాధించారు. భర్త, ఇద్దరు సంతానంతో కుటుంబ బాధ్యతలు ఉన్నాయి. స్థాయిగల 12 మ్యాచులు ఆడిన అనుభవం సొంతం. ఫాస్ట్ బౌలర్‌గా హార్డ్ హిట్టర్‌గా జట్టులో కొనసాగారు. క్రికెట్ అంపైరింగ్‌లో పూర్తి అవగాహన ఉంది. నేటికీ జట్టుకు అవసరమనుకుంటే వచ్చి ఆడేందుకు సిద్ధంగా ఉంటారు. ఖమ్మం నగరంలోని ఓ పాఠశాలలో కరాటే శిక్షకురాలిగా చేస్తున్నారు. వీరి బాటలోనే కుటుంబాలను చూసుకుంటు క్రికెట్ ప్రస్థానం సాగిస్తున్న మహిళా క్రికెటర్లలో పి.నాగలక్ష్మి, బి.అరుణ, నాగేంద్రమ్మ తమ ఆసక్తిని కొనసాగిస్తున్నారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం క్రికెట్ నెట్స్-1లో మహిళా క్రికెట్ సాధనలు ఉంటున్నాయి.

కార్పొరేషన్ కబుర్లు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ★ నగర పాలక సంస్థ గుత్తేదారులకు ఎన్నికల సందర్భంగా పని చేసిన బిల్లులు చెల్లించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతి పత్రం సమర్పించారు.

★ ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో 130 బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించిన నేపథ్యంలో వారంతా రూ.300 చొప్పున ట్రేడ్ లైసెన్స్ ఫీజులు నగర పాలక సంస్థ కార్యాలయంలో చెల్లించారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కోరం

కామేపల్లి, న్యూస్‌టుడే: మత్స్యకారుల ఉపాధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. పాతలింగాల పెద్ద చెరువులో ఉచిత చేప పిల్లలను గురువారం ఆయన వదిలారు. మత్స్యశాఖ సహాయ సంచాలకులు శివ ప్రసాద్, తహసీల్దార్ సుధాకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి: సీపీఎం

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు రుణమాఫీని వెంటనే పూర్తిస్థాయిలో అమలు చేసి, రైతు భరోసా నిధులను రైతుల ఖాతాలో జమ చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు బండి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ క్రాస్ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. గోళ్లపాడులో నవంబర్ 3న నిర్వహించనున్న పార్టీ మండల మహాసభను జయప్రదం చేయాలని కోరారు. మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

అభాగ్యురాలికి కలెక్టర్ సాయం



అన్నం శ్రీనివాసరావు నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: స్వగ్రామానికి వెళ్లేందుకు ఓ మహిళకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మానవతా దృక్పథంతో రూ.10 వేల చెక్కును గురువారం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా పొంగనూరుకు చెందిన దాసరి రమాదేవి(35) మతిస్థిమితం కోల్పోయి పెద్దగోపతిలో తిరుగుతుండగా గుర్తించి రెండున్నరేళ్ల కిందట ఖమ్మం అన్నం సేవాశ్రమంలో చేర్పించారు. కోలుకున్న ఆమె అందించిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు వచ్చారు. నిరుపేదరాలైన తమను ఆదుకోవాలని నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద రమాదేవి, ఆమె తల్లి కుమారి, కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కలిసి కోరారు. ఆశ్రమ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు ఆమె పరిస్థితిని కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ రూ.10 వేల చెక్కు అందజేశారు.

న్యాక్ బృందం సందర్శన



మాట్లాడుతున్న పురుషోత్తం నాయక్, వేదికపై చంద్రికాలయం, జోసఫ్

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం గురువారం సందర్శించింది. ఈ బృందంలో ఛైర్‌పర్సన్ పురుషోత్తం నాయక్, మెంబర్ కోఆర్డినేటర్ చంద్రికాలయం, మెంబర్ జోసెఫ్, రాష్ట్ర కళాశాల విద్యా కమిషనరేట్ కార్యాలయం నుంచి జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్ పాల్గొన్నారు. కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించారు. 2018 నుంచి 2023 వరకు జరిగిన అభివృద్ధిని, మౌలిక వసతులను పరిశీలించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి.పద్మావతి, కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త రాకేశ్ శ్రీరామ, అధ్యాపకులు పాల్గొన్నారు.

బిల్లులు లేకుండా విక్రయాలు వద్దు



రికార్డులను పరిశీలిస్తున్న సరిత

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: రైతులకు బిల్లులు ఇవ్వకుండా ఎలాంటి మందులు విక్రయించవద్దని, రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు సరిత అన్నారు. తిరుమలాయపాలెం, పిండిప్రోలు, దమ్మాయిగూడెం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లోని బిల్లు పుస్తకాలను, స్టాకు వివరాలను, లైసెన్సులను పరిశీలించారు. అమ్మిన ప్రతీ ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం గోడౌన్‌లోని స్టాకులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీతారామిరెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

రైల్వే ప్రాజెక్టులపై ఎంపీ సమీక్ష

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైల్వే ప్రాజెక్టులు, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు లోక్‌సభ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ రైలు నిలయంలో గురువారం రైల్వే అధికారులతో సమీక్ష నిర్వహించారు. డోర్నకల్- మిర్యాలగూడ, డోర్నకల్- గద్వాల రైల్వే లైన్ల నిర్మాణంపై చర్చించారు. కేంద్ర మంత్రులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

స్కేటింగ్ చిన్నారులకు స్వాగతం

ఖమ్మం క్రీడలు, కూసుమంచి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీ నుంచి భద్రాచలం వరకు చేపట్టిన బ్యాక్వార్డ్ స్కేటింగ్ యాత్రకు నాయకన్‌గూడెం వద్ద పలువురు నాయకులు గురువారం స్వాగతం పలికారు. సాహస యాత్రికులు రాజేష్‌కుమార్, ఉమేష్‌కుమార్‌ను అభినందించారు. మాజీ ఎంపీపీ బానోతు శ్రీనివాస్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఇన్‌ఛార్జి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

★ బ్యాక్ స్కేటింగ్ చేస్తున్న సోదరులు రాజేష్, ఉమేష్ నగరం బైపాస్‌రోడ్డు మీదుగా భద్రాచలం వైపు సాగిపోయారు. సర్దార్ పటేల్ స్టేడియంలోని స్కేటింగ్ బృందం వారికి స్వాగతం పలికింది.

ఉపాధి పనుల పరిశీలన

కామేపల్లి, న్యూస్‌టుడే: జాస్తిపల్లిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సివిల్ సర్వీసెస్ శిక్షణ అధికారులు గురువారం పరిశీలించారు. పనుల వివరాలు, వేతనాలు, కూలీల సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. జగన్నాథతండాలోని ఉపాధి నర్సరీని వారు సందర్శించారు. ఎంపీడీవో రవీందర్, ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి, ఏపీవో శ్రీరాణి పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి మృతి

కూసుమంచి, న్యూస్‌టుడే: నేలపట్లకు చెందిన సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి తుడుం రామనాథం అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర కమిటీ బాధ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ నివాళి అర్పించారు.

హుండీ ఆదాయం లెక్కింపు



విరాళమందించిన ఎన్.మధు దంపతులను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పెద్దమ్మ తల్లి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించినట్లు ఆలయ ఈవో రజనీకుమారి తెలిపారు. 3 నెలల 12 రోజులకు గాను రూ. 39,34,078 రూపాయల హుండీ ఆదాయం వచ్చినట్లు చెప్పారు. రోటరీనగర్‌కు చెందిన భక్తులు ఎన్.మధు-యామిని దంపతులు రూ.1,11,116 విరాళం ఇచ్చారు.

ఖమ్మం సభను విజయవంతం చేయాలి

కూసుమంచి, న్యూస్‌టుడే: ఉద్యోగ నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ జీవోను అమలు చేయకుంటే రాష్ట్రంలో మాదిగలు కాంగ్రెస్‌కు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెబుతారని ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు వంగూరి ఆనందరావు మాదిగ అన్నారు. జీళ్లచెర్వు, ముత్యాలగూడెంలో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. జీవో అమలును డిమాండ్ చేస్తూ ఖమ్మంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు.

విద్యారంగ సమస్యల్ని పరిష్కరించండి: ఎస్ఎఫ్ఐ

కూసుమంచి, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ డిమాండ్ చేశారు. కూసుమంచిలో గురువారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించిన ప్రభుత్వం అదే విధానాలను కొనసాగిస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న బోధన రుసుం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు ఉమేష్, వెంకట్ పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు.. శ్రీనివాస: లగ్గం(రెండు ఆటలు), వేట్టయన్(రెండు ఆటలు) శ్రీసాయిరాం: విశ్వం, శ్రీ తిరుమల: దేవర పార్ట్–1, సీఎన్ సినీ గెలాక్సీ: ఇద్దరు, వినోద: వేనం–ది లాస్ట్ డాన్స్ కేపీఎస్: పొట్టేల్(రెండు ఆటలు), వేనమ్: ది లాస్ట్ డాన్స్(రెండు ఆటలు)

పిల్లలకు పరిశుభ్రమైన ఆహారం అందించాలి



మాట్లాడుతున్న ఎస్సీ అభివృద్ధిశాఖ డి.డి. కస్తాల సత్యనారాయణ, చిత్రంలో బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి జ్యోతి

ఖమ్మం సంక్షేమవిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో పిల్లలకు రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఉప సంచాలకులు కస్తాల సత్యనారాయణ అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని ఎస్సీ(బి) వసతి గృహంలో జిల్లాలోని వసతి గృహాల్లో వంట పని చేసే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కస్తాల, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ జిల్లా అధికారి జ్యోతి, ఛైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విష్ణువందన పాల్గొన్నారు. వసతి గృహాల్లో వంట చేసే సమయంలో ఎటువంటి పరిశుభ్రత పాటించాలి, పిల్లలతో ఎలా మసలుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా నిపుణులతో కొన్ని రకాల వంటలు చేయించి, ఎలా వండాలో చూపించారు. నిపుణులతో సలహాలు, సూచనలు చెప్పించారు. కార్యక్రమంలో అధికారులు ఎం.ఈదయ్య, డి.నరసయ్య, కె.వెంకటేశ్వరరావు, అబ్దుల్ రవూఫ్, వార్డెన్లు కోటపాటి రుక్మారావు, ఎన్.నాగేశ్వరరావు, టి.స్టాలిన్, ఆర్.రాజ్యలక్ష్మి, నూర్జహాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: అమరుల ఆశయ సాధనకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు మెరుగు సత్యనారాయణ అన్నారు. కామంచికల్లులో ప్రతాపనేని సత్యనారాయణ వర్ధంతి సభను గురువారం నిర్వహించారు. మెరుగు సత్యనారాయణ మాట్లాడారు. గ్రామానికి ఉన్నత పాఠశాలను తీసుకొచ్చిన ఘనత సత్యనారాయణదేనని కొనియాడారు. కేంద్రంలో భాజపా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శించారు. జమిలి ఎన్నికల పేరుతో భాజపా కొత్త నాటకాలకు తెరతీస్తోందన్నారు. క్రికెట్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రతాపనేని వెంకటేశ్వర్లు, చింతల రమేశ్, గాంధీ, కృష్ణ, చిన్న వీరయ్య, పి.వెంకన్న, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

29న డయల్ యువర్ ఆర్ఎం

ఖమ్మం కమాన్‌బజార్ న్యూస్‌టుడే: 29న ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలపై డయల్ యువర్ ఆర్ఎం నిర్వహిస్తున్నట్లు రీజనల్ మేనేజర్ సరిరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్సులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ప్రయాణికులు 99592 25953 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

అధిక సాంద్రత సాగుతో 12 క్వింటాళ్ల దిగుబడి: ఏడీఏ

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: వైరా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రఘునాథపాలెం మండలం గణేశ్వరంలో అధిక సాంద్రతలో సాగు విధానంపై రైతులకు క్షేత్ర ప్రదర్శనను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రవికుమార్, నాగపూర్ పత్తి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సంపత్‌లతో కలిసి ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు రైతులకు అవగాహన కల్పించారు. అధిక సాంద్రత సాగుతో ఎకరాకు సుమారు 12 క్వింటాళ్ల పత్తి దిగుబడి సాధించవచ్చన్నారు. డిసెంబరు నాటికి పంటకాలం పూర్తవుతుందని, రెండో పంటగా మొక్కజొన్న, అపరాల సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు తప్పనిసరిగా సదరు సంస్థలతో ఒప్పందం(అగ్రిమెంట్) చేసుకోవాలని ఏడీఏ సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఉమామహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



గణేశ్వరంలో పత్తి పైరు క్షేత్ర సందర్శనలో ఏడీఏ వెంకటేశ్వరరావు, రైతులు

హరితహారం చెట్ల నరికివేతపై ఫిర్యాదు



నవోదయ ప్రహరీ ఎదుట నరికిన హరితహారం చెట్టు

కూసుమంచి, న్యూస్‌టుడే: పాలేరులో జవహర్ నవోదయ విద్యాలయం ఎదురుగా హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన చెట్లను నవోదయ విద్యాలయ బాధ్యులు గురువారం నరికించారంటూ స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విద్యాలయ ప్రధానాచార్యుడు శ్రీనివాసులు సిబ్బంది వెంట ఉండి నరికించారని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విద్యాలయ ప్రధానాచార్యుడు శ్రీనివాసులు వివరణ కోరగా, విద్యాలయ ప్రధాన ద్వారం వద్ద అడ్డుగా ఉన్న కారణంగా చెట్టును నరికించామని, ప్రత్యామ్నాయంగా మొక్కలను నాటిస్తామని చెప్పారు. ఫిర్యాదు విషయమై ఎంపీఓ రామచంద్రారావు మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయంగా మొక్కలు నాటించడంతో పాటు గ్రామ పంచాయతీ ద్వారా జరిమానా విధిస్తామన్నారు.

108 వాహనంలోనే ప్రసవం

కూసుమంచి, న్యూస్‌టుడే: నాయకన్‌గూడానికి చెందిన శిరీష అనే గర్భిణి బుధవారం రాత్రి 108 వాహనంలోనే పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. పురిటి నొప్పులతో ఆస్పత్రికి వెళ్లేందుకు వాహనం ఎక్కిన ఆమెకు నొప్పులు అధికం కావడంతో టెక్నీషియన్ అంబాల రాణి గర్భిణి కుటుంబ సభ్యుల సహకారంతో ప్రసవం చేశారు. అనంతరం ఖమ్మంలోని సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు.

వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం సర్వజనాసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ కోరారు. మాస్‌లైన్ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో ఏఓ అరుణను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ, నాయకులు ఆవుల మంగతాయి, శోభ, శ్రీనివాస్, సురేశ్, సత్తార్ మియా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్థుడి రిమాండ్

పోచారం(ఘట్‌కేసర్), న్యూస్‌టుడే: జల్సాలకు అలవాటుపడిన ఓ యువకుడు దొంగతనాలకు పాల్పడి మూడుసార్లు జైలుకు వెళ్లినా బుద్ధిలో మార్పు రాలేదు. మళ్లీ చోరీ చేసి పోలీసులకు చిక్కాడు. సీఐ బి.రాజువర్మ వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన బత్తుల రవీందర్(26) జల్సాలకు డబ్బుల కోసం చోరీలు చేసి జైలుకు వెళ్లాడు. బయటకొచ్చిన తర్వాత గత నెలలో పోచారం ఐటీకారిడార్ పోలీసు స్టేషన్ పరిధిలోని చౌదరిగూడలో రెండు ఇళ్లల్లో దొంగతనాలు చేశాడు. సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించి.. గురువారం అన్నోజిగూడ సమీపంలో రవీందర్‌ను పట్టుకున్నారు. గురువారం రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: నగదు తీసుకుని అమ్మిన స్థలం అప్పగించకుండా మోసం చేయడంతోపాటు, బెదిరింపులకు పాల్పడుతుండటంతో ఓ వ్యక్తి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన రఘునాథపాలెంలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. . మొగిలి సుధాకర్ రఘునాథపాలెంలోని కేటీఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. లక్ష్మణుడు అనే వ్యక్తి నుంచి కాలనీలో 150 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని 2023 జులై 27న రూ.3.20 లక్షలకు పూలమ్మ పేరుతో కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి రూ.2.10 లక్షలు చెల్లించారు. స్థలాన్ని తమ పేరిట ఆన్‌లైన్ చేయించాలని కోరితే నీ డబ్బు నీకు ఇస్తానని ఇవ్వకుండా లక్ష్మణుడు తిప్పుకుంటున్నారని, అదేమని అడిగితే బెదిరిస్తున్నాడని సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు చావే మార్గమంటూ లేఖ రాసిన ఆయన మంగళవారం(22న) ఎలుకల మందు తాగాడు. కుటుంబ సభ్యులు జిల్లా సర్వజనాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు. ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్‌ని సంప్రదించగా సంఘటనపై తమకు తొలుత ఫిర్యాదు అందిందని, ఇరువర్గాలు పెద్దల సమక్షంలో మాట్లాడుకుని రాజీ పడ్డారన్నారు. ఈ మేరకు తన ఫిర్యాదు వాపసు తీసుకుంటున్నట్లు గురువారం సుధాకర్ రాసి ఇచ్చాడని తెలిపారు.

ఈ వీధులు మారేదెన్నడు?

చిమ్మపూడిలో రహదారులపైనే పారుతున్న మురుగు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే

రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలో దారుణమైన పారిశుద్ధ్య పరిస్థితి కనిపిస్తోంది. ఎక్కడా మురుగు కాల్వలు లేకపోవడంతో ప్రధాన రహదారులపైనే నివాసాల నుంచి వచ్చే నీరు, మురుగు, వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో సీసీ రహదారులు సైతం దెబ్బతింటున్నాయి. ఆయా రహదారులపై ప్రయాణించే పాదచారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగు సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఎంపీఓ శ్రీనివాసరెడ్డిని సంప్రదించగా కొన్ని నివాసాల కింద రాయి ఉండటంతో నీరు భూమిలోకి ఇంకని పరిస్థితి ఉందన్నారు. రహదారిపైకి నీరు వస్తోందని, కొన్ని రహదారుల్లో మురుగు కాల్వలకు ప్రతిపాదనలు పంపామన్నారు.



నివాసాల నుంచి వచ్చిన నీరు నిలిచి చిత్తడిగా మారిన ప్రధాన రహదారి

మూల మలుపులో చిత్తడిగా ఉన్న ప్రధాన రహదారి

ప్రత్యేక వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెదడు, వెన్నెముక, నరాల చికిత్సపై రెండు రోజుల ప్రత్యేక వైద్య శిబిరం గురువారం ప్రారంభించారు. తొలి రోజు రోగులను పరీక్షించి చికిత్స అందించినట్లు ఆసుపత్రి జనరల్ మేనేజర్ భీమిరెడ్డి బాబురెడ్డి తెలిపారు. నేడు శిబిరం కొనసాగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.